Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 119 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 మే 2023 ఆదివారం పేజీలు : 4

## విద్యా, ఉద్యోగాల్లో వన్నియార్ కోటా రద్దు

న్యూఢిల్లీ: తమిళనాడులోని వన్నియార్ సామాజిక వర్గానికి ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో కల్పించిన 10.5 శాతం రిజర్వేషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రిజర్వేషన్‌ను రద్దు చేసిన మద్రాస్ హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు సమర్థించింది. "వన్నీకుల క్షత్రియులను ఒకే గ్రూపుగా వర్గీకరించడానికి గణనీయమైన ఆధారం లేదని, మిగిలిన వారి నుంచి భిన్నంగా పరిగణించాలని మేం భావిస్తున్నాం" అని సుప్రీంకోర్టు జస్టిస్ ఎల్ నాగేశ్వరరావు, జస్టిస్ బిఆర్ గవాయ్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు తమిళనాడులో చర్చనీయాంశంగా మారింది.



ప్రతిపక్షాలకు నరేంద్రుడు 'చెక్' పెట్టగలడా...!?

# 'హ్యాట్రిక్'పై మోడీ గురి

## పట్టులేని ఆ 100 స్థానాలలో గెలిచి తీరాల్సిందే!

### ఇప్పటి నుండే వ్యతిరేక పవనాలకు అనుకూలంగా మార్చే యత్నాలు

వచ్చే ఎన్నికల్లో మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టాలని నరేంద్ర మోడీ గట్టిగా డిసైడ్ అయ్యారు. ఇందులో భాగంగా ఇప్పటి నుండే అందుకు వ్యూహాలు మొదలుపెట్టారు.

దేశవ్యాప్తంగా 74 వేల పోలింగ్ కేంద్రాల్లో పార్టీ బాగా బలహీనంగా ఉందని పార్టీ అగ్రనేతలు నిర్ణయానికి వచ్చారు. అందుకనే మోడి కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుకుని 74 వేల పోలింగ్ కేంద్రాల్లో పార్టీని బలోపేతం చేయటంపై దృష్టిపెట్టారు. ఇందులో భాగంగానే నలుగురు నేతలతో ఒక టాస్క్ ఫోర్స్ టీమును ఏర్పాటు చేశారు. జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి - ఉపాధ్యయుడు బైజయంత్ పాండా - దిలీప్ ఘోష్ - ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాల్ సింగ్ ఆర్యాలు ఈ టీములో పనిచేస్తారు. 2014 - 19 ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు పోలింగ్ కేంద్రాల వారిగా వచ్చిన ఓట్లను ఆధారం చేసుకుని 74 వేల పోలింగ్ కేంద్రాల్లో పార్టీ బలహీనంగా ఉందని వీళ్ళు నిర్ణయానికి వచ్చారు. అందుకనే నలుగురు సభ్యులతో టాస్క్ ఫోర్స్ వేసి పర్యటించమని చెప్పారు. నలుగురు సభ్యుల టీము నాలుగు నెలలపాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో పర్యటిస్తుంది. 74 వేల పోలింగ్ కేంద్రాలున్న రాష్ట్రాలు - జిల్లాలు - నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించి స్థానిక నేతలతో భేటీ అవుతుంది. పార్టీ వాస్తవ పరిస్థితిని వివరించి బలోపేతం అయ్యేందుకు దిశా నిర్దేశం చేస్తుంది.

ఈ మొత్తంలో గమనించాల్సిందేమంటే 74 వేల పోలింగ్ కేంద్రాలు ఎక్కువగా దక్షిణాదిలోనే ఉన్నాయి. ఇదే సందర్భంలో పార్టీ ఇప్పటివరకు గెలవని స్థానాలు 100 ఉన్నాయి. వీటిల్లో కూడా అత్యధికం దక్షిణాదిలోనే ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ - ఏపీ - తమిళనాడు - కేరళ - కర్నాటకలో పార్టీ బలం మొదటి నుండి అంతంత మాత్రంగానే ఉంది.

వీటిల్లో కర్నాటకలో పరిస్థితి కాస్త మెరుగు. తర్వాత తెలంగాణాలోనే పార్టీకి కాస్త బలముంది. పరిస్థితి మరీ అన్యాయంగా ఉన్నది తమిళనాడు - ఏపీ - కేరళలోనే అని అగ్రనేతలు గుర్తించారు. అందుకనే దక్షిణాదిపై బాగా దృష్టి పెట్టారు. మరి వీళ్ళ కృషి ఏమేరకు ఫలిస్తుందో చూడాలి.




## హైదరాబాద్‌లో రూ.1250 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్న టెక్నిప్ ఎఫ్ఎంసీ.. మంత్రి కేటీఆర్ హర్షం

హైదరాబాద్: రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా మంత్రి కేటీఆర్ అమెరికా పర్యటన కొనసాగుతున్నది. తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పారిశ్రామిక విధానం, అందిస్తున్న ప్రోత్సాహంతో ఇప్పటికే ప్రపంచ దిగ్గజ కంపెనీలు రాష్ట్రానికి క్యూకడుతున్నాయి. తాజాగా ఫ్రెంచ్-అమెరికన్ ఆయిల్ అండ్ గ్యాస్ దిగ్గజం అయిన టెక్నిప్ ఎఫ్ఎంసీ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చింది. సాఫ్ట్‌వేర్ గ్లోబల్ డెలివరీ సెంటర్ అండ్ ప్రెసిషన్ ఇంజినీరింగ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీకి హైదరాబాద్‌ను కేంద్రంగా ఎంచుకున్నది. రూ.1250 కోట్లతో నగరంలో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నది. దీని ద్వారా ఇంజినీరింగ్ విభాగంలో 2500 ఉద్యోగాలు, తయారీ రంగంలో మరో వెయ్యి ఉద్యోగాలు రానున్నాయి. మొత్తంగా మరో 3500 మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. టెక్నిప్ ఎఫ్ఎంసీ నిర్ణయం పట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. దీనివల్ల హైదరాబాద్‌కు అదిపెద్ద ప్రోత్సాహం లభించినట్లయిందని, నగర సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచిందన్నారు.

## లైట్ తీసుకోవద్దు..నెమ్మదిగా కమ్మేస్తోంది.. రోజులో వెయ్యి కొత్త కేసులు

చాప కింద నీరులా విస్తరిస్తోంది మహమ్మారి. దాదాపుమూడేళ్ల క్రితం విరుచుకుపడిన కరోనా.. గడిచిన కొంతకాలంగా కామ్ గా ఉన్న సంగతి తెలిసిందే. ఎప్పుడైతే అలెర్టు గా ఉండమో అప్పుడే జూలు విదిలించే అలవాటు ఉన్న కరోనా మహ్మమారి తీరుకు తగ్గట్లే.. తాజాగా పెద్ద ఎత్తున కేసులు పెరుగుతున్నాయి. ఇటీవల కాలంలో కరోనాను పెద్దగా పట్టించుకోకపోవటం.. ప్రభుత్వాలు సైతం మొదట్లో ఇచ్చింతన ప్రాధాన్యతను తర్వాతి రోజుల్లో పెద్ద గా ఇవ్వకపోవటం తెలిసిందే. కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు.. వార్ ఫుట్ మీద నిలబడి ప్రభుత్వాలు.. వైద్య ఆరోగ్య శాఖకు ఇచ్చిన ప్రాధాన్యత అంతా ఇంతాకాదు.



బడ్జెట్ లో ఎంత మొత్తాన్ని అయినా ప్రజల ఆరోగ్యం కోసం పెట్టేందుకు ప్రభుత్వాలు వెనుకాడలేదు. అదే రీతిలో వ్యాక్సిన్ విషయంలోనూ వేలాది కోట్లు ఖర్చు చేయటం చూశాం. మొత్తంగా మహ్మమారి తీవ్రత తగ్గినా.. దాని ముప్పును మర్చిపోకూకుండా ఉండేందుకు అన్నట్లుగా అప్పుడప్పుడు మూట్యేషన్లతో విరుచుకుపడట తెలిసిందే. ఇప్పుడు మళ్లీ అలాంటి పరిస్థితులు ఎదురు కానున్నాయా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. ఎందుకంటే.. కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల్ని చూస్తే.. కరోనా కేసులు జెట్ స్పీడ్ తో విస్తరిస్తున్నాయి. చాలా రోజుల తర్వాత రోజు లో వెయ్యికి పైగా కేసులు ఈ రోజు (గురువారం) నమోదైనట్లుగా చెబుతున్నారు. గడిచిన కొద్ది నెలలుగా చేస్తున్న పరీక్షల్లో పాజిటివ్ కేసుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. దేశంలో కరోనా కేసులు పెరగటానికి కారణం ఎక్స్ బీబీ 1.16 వేరియంట్ అన్న అభిప్రాయాన్ని నిపుణులు చెబుతున్నారు. ఎప్పటిలానే కరోనాను అంటించుకోవటానికి.. అంటకుండా ఉండటానికి ఎవరికి వారు స్వీయ జాగ్రత్తలు తీసుకుంటే సరి. అందుకే లైట్ తీసుకోకుండా కేర్ ఫుల్ ఉండాల్సిన సమయం వచ్చేసింది.

# బీజేపీ వదిలేదేలే బీఆర్ఎస్ తగ్గేదేలే




## రంజుగా తెలంగాణ రాజకీయం

హైదరాబాద్ : తెలంగాణలో ఇప్పుడు సంకుల సమరం నడుస్తోంది. రెండు బలమైన పార్టీలు కొదమ సింహాల్లా పోరాడుతున్నాయి. కేంద్రంలో అధికార అండతో బీజేపీ.. రాష్ట్రంలో అధికారంతో బీఆర్ఎస్ నువ్వానేనా? అన్నట్టుగా తలపడుతున్నాయి. ఎవరూ వెనక్కి తగ్గకుండా ఒకరిపై ఒకరు విమర్శలు ప్రతి విమర్శలతో రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నారు.. ఈ క్రమంలోనే కేసులు అరెస్ట్ ల వరకూ ఈ వార్ సాగడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది..

**-జాతీయ పార్టీతో వార్ షురూ చేసిన కేసీఆర్ :** బీజేపీ విధానాలు నచ్చకపోవడం.. రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా సతాయిస్తుండడం.. తెలంగాణలో తనకు ప్రధాన పోటీగా మారిన బీజేపీని ఎదుర్కోవడానికి కేసీఆర్ జాతీయ పార్టీగా మార్చారు. టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చేసి కేంద్రంపై ఫైట్ కు దిగారు. జాతీయ స్థాయిలో పార్టీని విస్తరించి బీజేపీ కాంగ్రెస్ యేతర ప్రభుత్వ స్థాపన కోసం కష్టమైనా సరే శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. కేసీఆర్ తమకు పోటీగా రావడంతోనే బీజేపీ సైతం ఆయనపై ఫోకస్ చేసింది. కేసీఆర్ లూప్ హెూల్స్ వెతికడం ప్రారంభించిందన్న చర్చ సాగింది.

**-ఇక్కడ ఫాంహౌస్ కేసు.. అక్కడ ఢిల్లీ లిక్కర్ కేసు :** తెలంగాణకు వచ్చి మరీ తన ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి ప్రయత్నించిన బీజేపీ ఏజెంట్లను పట్టుకొని జాతీయ స్థాయిలో కమలం పార్టీ పరువు తీశాడు కేసీఆర్. దాంతో రగిలిపోయిన బీజేపీ పెద్దలు ఇక ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత ప్రమేయంపై ఆరోపణలు చేశారు. అంతేకాకుండా ఈడీ నోటీసులు జారీ చేసి ఆమెను విచారిస్తోంది. ఇలా ఇద్దరూ కేసులతో ప్రారంభమైన ఫైట్ ఇప్పుడు ముదిరిపాకాన పడింది..

**-బండి సంజయ్ అరెస్ట్ తో వార్ షురూ :** కవితను ఈడీ మూడు సార్లు విచారించడంతో కంగారుపడ్డ బీఆర్ఎస్ కు తెలంగాణలో టీఎస్.పీఎస్సీ పదోతరగతి పేపర్ లీకేజీలు మరింత డ్యామేజ్ చేశాయి. అయితే ఈ పదోతరగతి పేపర్ లీకేజీ కేసులో తెలంగాణ బీజేపీ చీఫ్ ను ఏ1గా నిర్ధారించిన పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపడంతో బీజేపీపై బీఆర్ఎస్ వార్ కొత్త మలుపు తిరిగింది.

బండి సంజయ్ నే పేపర్ లీక్ ను ప్రోత్సహించారన్న అపవాదు బీజేపీపై పడడడంతో ఇది కొత్త మలుపు తిరిగింది.

**-కవిత కేసీఆర్ పై వీడియోతో బీజేపీ షాకిచ్చింది :** ఇక తెలంగాణ బీజేపీ చీఫ్ అరెస్ట్ తో కేంద్రంలోని బీజేపీ పెద్దలు యుద్ధానికి రెడీ అయ్యారు. తాజాగా బీజేపీ జాతీయ ట్విట్టర్ హ్యాండిల్స్ లో కేసీఆర్ అవినీతి కవిత అరెస్ట్ ఖాయమంటూ ఓ కార్టూన్ వీడియోతో బీజేపీ హెచ్చరిస్తూ వీడియో పెట్టడం సంచలనమైంది. ఈ పరిణామాలన్నింటిని చూస్తుంటే కేసులు అరెస్ట్ లతోనే బీజేపీ బీఆర్ఎస్ వార్ షురూ అయినట్టే కనిపిస్తోంది. ఎక్కడ రెండూ పార్టీలు తగ్గవని తెలుస్తోంది. తెలంగాణ బీజేపీ చీఫ్ అరెస్ట్ కు బీజేపీ ప్రతీకారం తీర్చుకుంటుందని.. ఇక కేసీఆర్ సైతం బీజేపీని వదిలిపెట్టకూడదని డిసైడ్ అయినట్టుగా పరిణామాలను బట్టి అర్థమవుతోంది.

# సంపాదకీయం

## మోడీనా మజాకా!!

మొన్నటికి మొన్న అయోధ్యలో రామమందిర నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. అబ్బ.. ఆర్ ఎస్ ఎస్ అనుకున్నది సాధించేసిందిగా.. అని బుగ్గలు నొక్కుకున్నారు. తర్వాత.. కశ్మీర్ ప్రత్యేక హక్కులకు సంబంధించిన ఆర్టికల్ 370ని రద్దు చేశారు.. ఇంకేముంది.. ప్రజాస్వామ్య వాదులు లబోదిబోమన్నారు. మరి ప్రధాని నరేంద్ర మోడీ హవా అక్కడితో ఆగిందా.. లేదు.. లేదు.. ఇప్పుడు హిందీ వరకు వచ్చేసింది. ఔనన్నా.. కాదన్నా.. మోడీ ఎఫెక్ట్ తో ఈ దేశం.. "హిందీ.. సీఖో.. లిఖో.. బాతో!" సూత్రాన్ని తూ.చ. తప్పక పాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే.. ఇది కూడా ఆర్ ఎస్ ఎస్ సిద్ధాంతాల్లోని త్రిభాషా సూత్రం కావడమే ఇప్పుడు ప్రధాన వివాదానికి తెరదీసింది. ప్రస్తుతం దేశంలోఅనేక ప్రాంతీయ భాషలు ఉన్నాయి. దాదాపు అధికార భాషగా.. ఆంగ్లం అమలు జరుగుతూనే ఉంది. అయితే.. రాజభాషగా ఉన్న హిందీనే దేశం మొత్తం అమలు కావాలనేది ఆర్ ఎస్ ఎస్ కీలక సిద్ధాంతం. ఇదే.. ఇప్పుడు మోడీ అమలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే తాజాగా.. సెంట్రల్ యూనివర్సిటీలతోపాటు ఐఐటీ ఐఐఎం వంటి టెక్నికల్ లేదా నాన్టెక్నికల్ విద్యాసంస్థల్లో హిందీ భాషను తప్పనిసరి చేయాలంటూ అమిత్ షా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సులు తీవ్ర వివాదానికి కారణంగా మారాయి. ఈ విషయంపై దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. పలు రాజకీయ పార్టీల నేతలు ఈ సిఫార్సులను వ్యతిరేకిస్తున్నారు. దేశంలో చాలా అధికారిక భాషలుండగా హిందీనే ప్రధాన భాషగా చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. మరోవైపు కేంద్రం ప్రయత్నాలను తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతో పాటు పలువురు నేతలు తీవ్రంగా తప్పుపడుతున్నారు. విద్యా సంస్థలు ప్రభుత్వ నియామకాల్లో హిందీని తప్పనిసరి చేసే విషయంలో నిరుద్యోగులు విద్యార్థులకు ఎన్నో భయాలు నెలకొన్నాయి. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనకు ప్రతీకగా నిలిచే భారత్లో ఏ ఒక్క భాషనూ ఇతర భాషల కంటే ఎక్కువ చేసినా అది దేశ సమగ్రతను దెబ్బతీస్తుంది. దేశంలో చాలా భాషలు అధికారికంగా ఉన్నప్పుడు హిందీని ప్రధాన భాషగా పేర్కొనొద్దనేది .. ప్రాంతీయ పార్టీల వాదన. కాదు.. దేశం మొత్తం.. హిందీ మాట్లాడాలి.. నేర్చుకోవాలి.. రాయాలి.. అనేది మోడీ సిద్ధాంతం.. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# జోరుగా రియల్ వ్యాపారం



జగిత్యాల : జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతున్నది. డీటీసీపీ (డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతులు లేకుండానే యథేచ్ఛగా ప్లాట్లను విక్రయిస్తుండడంతో వాటిని కొనుగోలు చేస్తున్న వారు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏడాపెడా వ్యవసాయ భూములను రియల్ భూములుగా మార్చుతున్నారు. ఏడాది కాలంగా జిల్లాలో గల భూములకు రెక్కలు రావడంతో అనేక మంది రియల్ వ్యాపారంపై దృష్టి సారించారు. మధ్యవర్తులు ప్రమేయంతో నిబంధనలను ఉల్లంఘించి ప్లాట్లను విక్రయించి ప్రజలను మోసగిస్తున్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాలు, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీల పరిధిలో, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నది. – జిల్లాలో 1500 పైగా వెంచర్లు..జిల్లాలో 1500కు పైగా రియల్ వెంచర్లు ఏర్పాటు కావడం గమనార్హం. రాజీవ్ రహదారిలో దుబ్బపల్లి నుంచి మొదలుకుని గోదావరిఖని వరకు, మంథని రోడ్డులో పెద్దపల్లి నుంచి మంథని వరకు, ధర్మారం రోడ్డులో పెద్దపల్లి మండల పరిధిలోని రియల్ వెంచర్లను ఏర్పాటు చేశారు. రోజు రోజుకూ భూములకు డిమాండ్ పెరుగుతుండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమాలకు పడుతున్నారు. డీటీసీపీ అనుమతులు లేకుండా, నాలా కన్వర్షన్ లేకుండానే ప్లాట్లను విక్రయిస్తున్నారు. జిల్లాలో వందల సంఖ్యలో రియల్ వెంచర్లు వెలసినప్పటికీ, డిస్ట్రిక్ట్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అధికారుల నుంచి అనుమతులు ఉన్న వెంచర్లు 10 లోపే ఉంటాయి. మిగతా వెంచర్లన్నింటికీ అనుమతులు లేకపోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం మున్సిపాలిటీల పరిధిలో అంతర్గత రహదారులు 40 అడుగుల వెడల్పు వరకు, గ్రామ పంచాయతీల పరిధిలో అంతర్గత రహదారులను 30 నుంచి 40 అడుగుల వరకు పెట్టాల్సి ఉంటుంది. కమ్యూనిటీ అవసరాల కోసం పది శాతం భూమిని వదిలి పెట్టాల్సి ఉంటుంది. చాలా మంది వ్యాపారులు అంతర్గత రోడ్లను 20 నుంచి 30 అడుగుల వెడల్పు మాత్రమే పెట్టారు. డీటీసీపీ అనుమతులు చాలా వాటికి లేవు. ఇవేమి లేకుండానే రియల్ వ్యాపారులు ప్లాట్ల విక్రయాలు చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు ముడుపులు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. కొందరు రియల్ వ్యాపారులు భూమిని సేకరించి అందులో ఒకటి, రెండు సర్వే నంబర్లను మాత్రమే నాలా కన్వర్షన్ కింద చేయిస్తున్నారు. కన్వర్షన్ అయిన భూములను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో, నాలా కన్వర్షన్ కానీ భూములను మండల రెవెన్యూ కార్యాలయాల్లో తహసీల్దార్లను మచ్చిక చేసుకుని గజాలల్లో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. డీటీసీపీ అనుమతులు లేని లే అవుట్లలో విక్రయించే ప్లాట్లను రిజిస్టర్ చేయరాదనే నిబంధనలు ఉన్నప్పటికీ నాలుగు మాసాల క్రితం వరకు అనేక ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశారు. ఈ వ్యవహారంలో సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందిన కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. – మోసపోతున్న కొనుగోలుదారులు..డీటీసీపీ అనుమతులు లేని వెంచర్లలో నామ్‌కే వాస్తేగా మున్సిపల్ అధికారులు, పంచాయతీ సిబ్బంది, జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం ప్లాట్ల ఏర్పాటుకు వేసిన హద్దు రాళ్లను తొలగించారు. వారు వెళ్లిన తర్వాత మళ్లీ రాళ్లను పెడుతున్నారు. డీటీసీపీ అనుమతులు లేని ప్లాట్లను విక్రయిస్తున్న ప్రజలు నిలువునా మోసపోతున్నారు. భవిష్యత్తులో కొనుగోలు చేసిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసుకోవాలంటే వారు తప్పనిసరిగా మున్సిపాలిటీలో గానీ, పంచాయతీలో గానీ పర్మిషన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ సమయంలో రహదారుల విషయంలో నిబంధనలను అనుసరించి సెట్ బ్యాక్ అయితేనే అనుమతులు ఇస్తున్నారు. ఈ క్రమంలో అనేక మంది నష్టపోవాల్సి వస్తున్నది. కష్టపడి, చెమటోడ్చి సొంత ఇంటి కలను నెరవేర్చుకునేందుకు స్థలాలను కొనుగోలు చేస్తున్న వారిని రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిలువునా మోసగిస్తున్నారు. వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చిన వెంటనే ఆ భూములను నాలా కన్వర్షన్ చేశారా, లేదా అని పరిశీలించడం లేదు. నాలా కన్వర్షన్ చేయక పోవడంతో ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడుతున్నది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారుల మోసాలను అరికట్టాలని, డీటీసీపీ అనుతులు లేకుండా వెంచర్లను ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# కన్నీరే మిగిలింది



వేములవాడ :అన్నదాతలను ఎల్లంపల్లి జలాలు ఆదుకోలేకలేదు. అధికారుల నిర్లక్ష్యధోరణి, పాలకుల అశ్రద్ధ కారణంగా రైతులకు ఈసారి కన్నీరే మిగిలింది. ఓ వైపు ఎండలు మండిపోతుండగా పంటలు తడపాల్సిన ఎల్లంపల్లి జలాలు వృథాగా మిగిలాయి. జిల్లాలో వేలాది ఎకరాల్లో వరిపంట, మొక్కజొన్న, కూరగాయలు, పండ్ల తోటలు ఎండిపోతుండగా ఆందోళన వ్యక్తమవుతోంది. గతేడాది యాసంగిలో ఏ గ్రామంలో చూసినా ధాన్యం రాశులతో రైతుల ఇంట సిరుల పంట పండింది. ఇక కరవు కష్టాలు శాశ్వతంగా తీరినట్లేనని ఆశించిన రైతుల ఆశలు ఆవిరయ్యాయి. గడిచిన అయిదేళ్లుగా రెండు పంటలకు నారాయణపూర్, గంగాధర చెరువులను నింపి ఇక్కడి నుంచి కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లోని ఆయా మండలాలకు సాగునీటిని సరఫరా చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికెనపల్లిలో పైపులు మరమ్మతులకు గురవడంతో యాసంగిలో నీటి విడుదల నిలిచిపోయి పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా నీరు విడుదల చేస్తే సగం పంటయినా దక్కుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బావుల తవ్వకం.. పెట్టుబడుల భారం

నందిమేడారం జలాశయం నుంచి గంగాధర, నారాయణపూర్ చెరువులకు రెండు పైపులైన్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తారు. ఇక్కడి నుంచి గంగాధర, రామడుగు, బోయినపల్లి, కొడిమ్యాల, మల్యాల మండలాలతోపాటు వేములవాడ నియోజకవర్గానికి నీరందిస్తారు. ఎల్లంపల్లి జలాల ఆధారంగా ఉమ్మడి జిల్లాల్లో దాదాపు లక్షా ఎకరాలకు పైగా వరి, ఇతర పంటలు సాగు చేశారు. ప్రతిఏటా జనవరి చివరి వారం లేదా ఫిబ్రవరి మొదటి వారంలో నీరు విడుదల చేస్తుండగా ఈసారి పైపుల మరమ్మతుల పేరుతో కాలయాపన జరుగుతోంది. ఫలితంగా గంగాధర, లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, చర్లపల్లి, కొండాయపల్లి, కుర్మపల్లి, వెంకటాయపల్లి, కాచిరెడ్డిపల్లి, ర్యాలపల్లి, మల్యాల మండలం బల్వంతాపూర్, కొడిమ్యాల మండలం నర్సింహులపల్లి, గౌరాపూర్, ఇతర గ్రామాల్లో ఇప్పటికే దాదాపు 5 వేల ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. ఇంకో వారం రోజుల వరకు నీరు రాకపోతే వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంటలు కాపాడుకునేందుకు రైతులు వేలాది రూపాయలు వెచ్చించి వ్యవసాయ బావుల్లో పూడికమట్టి తొలగించి లోతు చేస్తున్నారు. అయినప్పటికీ నీటి ఊటలు రావడం లేదు. నారాయణపూర్ చెరువులో ఆయా గ్రామాలకు చెందిన రైతులు పొక్లెయిన్ యంత్రాలతో కాలువలు తవ్వి నీటిని తరలించుకుంటున్నారు. మోటారు పంపుసెట్లు, పైపులైన్లు వేసి భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. గంగాధర, నారాయణపూర్ చెరువుల్లోనూ నీరు అడుగంటిపోతుంది.

రూ. 60 వేలతో .. – ఏగుర్ల గౌరవ్వ, చర్లపల్లి

మూడెకరాల్లో వరిపంట వేస్తే నీరు లేక ఎండిపోతుంది. నారాయణపూర్ చెరువు పక్కనే నీటి ఊటలు అడుగంటిపోగా 18 గజాల లోతు ఉన్న బావిని రూ. 60 వేలతో పూడికమట్టి తొలగించి లోతు చేసినా నీరు రావడం లేదు. అరగంట మాత్రమే నీరు వస్తుండగా ఒక్క మడి కూడా పారడం లేదు. రాత్రిపూట బావి వద్దే ఉంటూ అరకొర నీటితో వరుస తడితో పంటను కాపాడుకుంటున్నాం. ఇప్పటికైనా నీరిస్తే గట్టెక్కుతాం.

అప్పులే మిగిలాయి.. – మొట్టె రాజు, చర్లపల్లి ఎన్

ఎల్లంపల్లి జలాల ఆధారంగా అన్నదమ్ములిద్దరం పదెకరాల్లో వరిపంట వేశాం. రూ.2 లక్షల పెట్టుబడి వెచ్చించాం. వ్యవసాయ బావిలో నీరు అడుగంటిపోయి పదెకరాల్లో వరిపంట పూర్తిగా ఎండిపోయి అప్పులే మిగిలాయి. ఎంతో ఆశతో పంట సాగు చేస్తే పెట్టుబడులు పోగా కొంతలో కొంతైనా మిగులుతుందనుకుంటే మాకు కన్నీరే మిగిలింది.

# ఆమెకు అండగా 'సఖి'

మెదక్ : మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురవుతున్న మహిళలకు మేమున్నామంటూ సఖి కేంద్రాలు మనోధైర్యాన్ని కల్పిస్తున్నాయి. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2019 సెప్టెంబరులో మెదక్‌లో సఖి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వ్యక్తిగత సమస్యలతో వచ్చిన వారికి న్యాయపరమైన సూచనలు ఇవ్వడంతో పాటు న్యాయ, వైద్య, పోలీసు శాఖల సమన్వయంతో అన్ని రకాల సేవలందిస్తున్నారు. కౌన్సెలింగ్, న్యాయ సేవలు అందించడమే కాకుండా బాధిత మహిళల తరపున కేసులు నమోదు చేసి న్యాయం జరిగేలా చూస్తున్నారు. మహిళలకు అండగా 181 హెల్ప్‌లైన్‌సఖి కేంద్రాలకు నేరుగా వచ్చి ఫిర్యాదు చేయలేని మహిళల కోసం హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. సమస్యల్లో ఉన్న మహిళలు టోల్‌ఫ్రీ నంబర్ 181 లేదా మెదక్ జిల్లా సఖి కేంద్రం నంబర్ 08452-285181, 9346146580నంబర్లలో ఫిర్యాదు చేయవచ్చు. ఏ సమయంలోనైనా, ఎలాంటి సమస్య ఉన్నా సఖి వాహనం వారున్న ప్రదేశానికి చేరకుంటుంది.

# వైద్య కళాశాల ఏర్పాటుకు స్థల పరిశీలన

సిరిసిల్ల : సిరిసిల్లకు వైద్య కళాశాల మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లా వాసులకు కార్పొరేట్ సేవలు మరింత దగ్గర కానున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రస్తుతం హైదరాబాద్, కరీంనగర్ వంటి నగరాలకు రోగులను పంపిస్తున్నారు. ఇక్కడ వైద్య కళాశాల నిర్మిస్తే ఆ పరిస్థితి ఉండదు. స్థానికంగానే ఖరీదైన వైద్యం పేద, మధ్య తరగతి ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది.సిరిసిల్లలోని పెద్దూరు సమీపంలో వైద్య కళాశాల నిర్మాణం కోసం పరిశీలించారు. అక్కడ ప్రభుత్వ భూమి ఉండటంతో 20 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. నెల రోజుల్లో పనులు ప్రారంభించే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రి అభివృద్ధికి రూ.50 కోట్లు వచ్చాయి. వీటితో ముందుగా పనులు ప్రారంభించాలని భావిస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తరవాత రూ.50 కోట్లను మళ్లీ జిల్లా ఆసుపత్రికి ఇచ్చే విధంగా ఆలోచన చేస్తున్నారు. మరోవైపు పనులు ప్రారంభించడానికి జాతీయ వైద్య కౌన్సిల్ అనుమతి తీసుకునేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వానికి నివేదిక...ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ఒక ప్రాంతీయ ఆసుపత్రి, ఒక జిల్లా ఆసుపత్రి ఉంది. జిల్లాలో ప్రస్తుతం వైద్య పరంగా అందుతున్న సేవలపై ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపించారు. జిల్లాలో వైద్య విధాన పరిషత్, వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో ఎన్ని ఆసుపత్రులు ఉన్నాయి, వాటిలో రోగులకు అందుతున్న సేవలు, అందుబాటులో ఉన్న పరికరాలు, మౌలిక వసతులు, రోగుల సంఖ్య తదితర వివరాలతో నివేదికను అందించినట్లు అధికార వర్గాల సమాచారం. వైద్య కళాశాలకు అనుబంధంగా నర్సింగ్ కాలేజీ ఉండాలి. ఇప్పటికే నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయడంతో సమస్య లేదు. కళాశాలలో సీట్ల ఆధారంగా పడకలను ఏర్పాటు చేయనున్నారు.

# భవన అనుమతులు ఆలస్యం

కరీంనగర్ :నగరంలోని జగిత్యాల రోడ్డులోని ఓ ఇంటి యాజమాని జీ+3 భవన నిర్మాణం కోసం గతేడాది నవంబర్‌లో దరఖాస్తు చేశారు. ఈ స్థలాన్ని 57 రోజులకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ తర్వాత 12 రోజులకు టెక్నికల్ అనుమతి పట్టణ ప్రణాళిక అధికారి ఇచ్చారు. దీనికి ఫీజు వేస్తే కమిషనర్ లాగిన్ నుంచి అనుమతి లభిస్తోంది. అంటే 21 రోజుల్లో పూర్తి కావాల్సిన ప్రక్రియను 69రోజులు దాటినా పూర్తి కాలేదు.

కొత్త ఇంటిని నిర్మించుకోవడానికి నిబంధనల ప్రకారం మున్సిపాలిటీ అనుమతి తీసుకోవాలని ముందుకొస్తే అవస్థలు తప్పడం లేదు. అధికారుల చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్ విధానం అమలవుతున్నా నిర్ణీత గడువులోగా అనుమతులు పొందే పరిస్థితి లేకుండా పోతుంది.జిల్లాలోని కరీంనగర్ నగరపాలికతో పాటు మున్సిపాలిటీల్లో తెలంగాణ స్టేట్ బిల్డింగ్ పర్మిషన్ అప్రూవల్ సిస్టం ఆన్ సెల్ఫ్ సర్టిఫికేషన్(టీఎస్ బీపాస్) ఆన్‌లైన్ వ్యవస్థను తీసుకొచ్చారు. భవన నిర్మాణదారులు ఏ అధికారి దగ్గరికి వెళ్లకుండానే అనుమతులు తీసుకునే అవకాశాన్ని కల్పించారు. సులువుగా, సులభంగా గడువులోగా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అనుమతులు జారీ



చేయాల్సి ఉండగా క్షేత్రస్థాయి నుంచి మొదలుకొని టెక్నికల్ అనుమతి వరకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటివరకు నగరపాలక సంస్థ పరిధిలోనే సుమారు 80వరకు దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ప్రజాప్రతినిధులు, ప్లానర్లు, ఉన్నతాధికారులు ఎవరైనా ఫలాన దరఖాస్తు పెండింగ్‌లో ఉందని సిఫారసు చేస్తే తప్ప ఆన్‌లైన్ నుంచి కదలడం లేదు.

21 రోజులు దాటితే ఆమోదించినట్లే

టీఎస్ బీపాస్ ద్వారా భవన అనుమతి కోసం దరఖాస్తు చేస్తే 14 రోజుల లోపు క్షేత్రస్థాయిలో పరిశీలన, టెక్నికల్ అనుమతి వంటివి పూర్తి చేసి అనుమతి పత్రం జారీ చేయాలి. ఏదైనా సాంకేతిక పరంగా సమస్య ఉన్నట్లయితే వెంటనే తిరస్కరించాలి. లేదంటే దరఖాస్తుదారుడికి సమాచారం ఇచ్చి వెంటనే పరిష్కారానికి చొరవ చూపాలి. ప్రస్తుతం 60 డివిజన్లకు ఆరుగురు డిప్యూటీ తహసీల్దార్లు ఉన్నారు. వీరంతా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తును వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదించాలి. ఆ తర్వాత పట్టణ ప్రణాళిక పర్యవేక్షకులు వచ్చిన దరఖాస్తుకు జత చేసిన పత్రాలు సరిగా ఉన్నాయో, లేదో చూసి ఫీజు వేసేందుకు పై అధికారికి చేయాలి. అలా కాకుండా స్థల పరిశీలన వారం వరకు సమయం తీసుకుంటున్నారు. టెక్నికల్ అనుమతి మరో వారానికి పైగా పడుతున్నట్లుగా తెలుస్తోంది. దాంతో నిర్ణయించిన సమయం దాటి పోతుంది. ఈ లెక్కన 21 రోజులు దాటితే ఆ దరఖాస్తు డీమ్డ్ అప్రూవల్‌లోకి వస్తోంది. దీనికి కూడా 15రోజుల గడువు విధించారు. ఆ లోగా పరిశీలించకపోతే ఆటోమెటిక్‌గా భవన అనుమతి ఇంటి యాజమానికే ఆన్‌లైన్‌లో రానుంది.

ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులు లేకున్నా

కొత్త భవన అనుమతుల చట్టం నవంబర్ 15, 2020న అమల్లోకి వచ్చింది. దాని ప్రకారం పట్టణ ప్రణాళిక అధికారులు ఎట్టి పరిస్థితిలో భవన నిర్మాణాల ఫిర్యాదుల వైపు తొంగి చూడకూడదు. వచ్చిన ఫిర్యాదులన్నీ జిల్లాస్థాయిలోని టాస్క్‌ఫోర్స్ కమిటీ చూడాల్సి ఉండగా ఆ ఎన్‌ఫోర్స్‌మెంట్ విధులను వీరే నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడికీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది చేరుకుంటున్నారు. ఒకరిద్దరూ పర్యవేక్షకులు హద్దు మీరి ప్రవర్తిస్తున్నట్లుగా సామాజిక మాధ్యమాల్లో ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణదారులను బెదిరింపులకు గురి చేసి అందినంత దండుకుంటున్నట్లు విమర్శలు జోరందుకున్నాయి. దీంతో వీరు టీఎస్‌బీపాస్‌లో వచ్చిన దరఖాస్తులపై దృష్టిసారించకపోవడంతో పెండింగ్‌లో ఉంటున్నాయి.

జాప్యానికి రూ.5 వేల జరిమానా

భవన అనుమతుల కోసం దరఖాస్తుదారులు ఇబ్బందులు పడటమే కాకుండా ఆన్‌లైన్ విధానంలో సెల్ఫ్ సర్టిఫికేషన్ జరిగిపోతున్నట్లుగా ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. నగరపాలిక పరిధిలోని ఓ పట్టణ ప్రణాళిక అధికారి(టీపీవో) దగ్గర మొత్తం 22 దరఖాస్తులు లాగిన్‌లో ఉండగా..అందులో 14రోజుల గడువు దాటినవి 5 ఉన్నట్లు తేలింది. ఇంకేముంది సదరు టీపీవోకు రూ.5వేలు జరిమానా విధిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఈనెల 8న ఆదేశాలు జారీ చేశారు.

# దయచేసి వినండి.. సమస్యలు పరిష్కరించండి

జనగామ : రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు మౌలిక వసతులు లేవు. నిత్యం వందల సంఖ్యలో ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్, మెమూ రైళ్లు ప్రయాణించే మార్గంలోని రైల్వేస్టేషన్లలో ఇలాంటి దుస్థితి ఎందుకనేది ఎవరికీ అర్థం కావడం లేదు. ప్రయాణికులు గోడు పెట్టుకోవడం తప్పితే.. వాటిని ఆలకించే నాథుడు లేకపోవడం శాపంగా మారింది. ఫలితంగా రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రధానమైన రైల్వేస్టేషన్లలో పరిశీలన చేపట్టింది.

సౌకర్యాలు మెరుగుపర్చాలి

జనగామ స్టేషన్‌లోని రెండు ప్లాట్‌ఫామ్‌లపైన చాలినన్ని షెడ్లు లేవు. రెండో ప్లాట్‌ఫామ్‌పై అదనపు బుకింగ్ కౌంటర్ ఏర్పాటు చేయాలని, జనగామలో సింహపురి, శాతవాహన, చార్మినార్, గోదావరి తదితర రైళ్ల హాల్టింగ్ ఇవ్వాలని దశాబ్దాలుగా కోరుతున్నా రైల్వే ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణం రైలు పట్టాలకు రెండు వైపులా విస్తరించి ఉంటుంది. మొదటి ప్లాట్‌ఫామ్ నుంచి రెండో ప్లాట్‌ఫామ్ బయటకు పట్టణ ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని చెబుతున్నా.. ఆచరణలో అమలు కావడం లేదు. అమృత్‌భారత్ రైల్వేస్టేషన్ పథకంలో జనగామ స్టేషన్ ఎంపికైందని, త్వరలోనే పనులు ప్రారంభించి ప్రయాణికుల



సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మరుగుదొడ్లకు తాళాలు..జనగామ రైల్వేస్టేషన్‌లో మొదటి ప్లాట్‌ఫామ్ పైన పురుషులు, మహిళలకు మరుగుదొడ్లు ఉన్నాయి. ఏడాది కాలంగా వీటి నిర్వహణ లేక తాళం వేసి ఉంచారు. ప్లాట్‌ఫామ్‌ల పైన మంచినీటి కుళాయిలు ఉన్నప్పటికీ.. నీరు సక్రమంగా రావడం లేదు. ఉదయం వేళల్లో మినహాయించి మధ్యాహ్నం నుంచి కుళాయిల్లో నీరు రావడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

వెయిటింగ్ హాల్‌లో ఖాళీ సీసాలు

జనగామ స్టేషన్‌లో ఉన్న ఉన్నతశ్రేణి వెయిటింగ్ హాల్ ఎప్పుడూ మూసి ఉంటుందని రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు చెబుతున్నారు. సాధారణ టికెట్ తీసుకున్న ప్రయాణికులు వేచి ఉండే వెయిటింగ్ హాల్‌లో స్టేషన్‌లో పనిచేస్తున్న స్వీపర్లు ఖాళీ సీసాలు, ఇతర కాటన్ డబ్బాలను నిల్వ చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు కూర్చునేందుకు అవస్థలు పడుతున్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

జనగామ స్టేషన్ బయట పే అండ్ యూజ్ మూత్రశాలలను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం ర్యాంప్‌తో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి నిరుపయోగంగా మార్చారు. బయట నిర్మించిన మరుగుదొడ్లలో ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. బయట మరుగుదొడ్ల నిర్వహణ చూసే గుత్తేదారు పట్టింపు లేకపోవడంతో అస్తవ్యస్థంగా తయారైంది.

అస్తవ్యస్తంగా పార్కింగ్

జనగామ స్టేషన్ ప్రధాన ద్వారం ఎదుట, స్టేషన్ ఆవరణలో చెట్ల కింద ఇష్టానుసారంగా ద్విచక్ర వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో.. ఇబ్బందిగా మారింది. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వాహనాలు నిలిపే స్టాండ్‌ను ఎక్కువ మంది ఉపయోగించుకోవడం లేదు.

విరిగిన బెంచీలు.. పనిచేయని నల్లాలుస్టేషన్‌ఘన్‌పూర్ రైల్వే స్టేషన్ ప్లాట్ఫారాల్లో క్యాంటీన్ సౌకర్యం లేదు. మరుగుదొడ్ల సౌకర్యం లేదు. ప్లాట్ఫారాలపై చిన్నగా ఏర్పాటు చేసిన షెడ్‌లలో ఫ్యాన్లు బిగించలేదు. పలుచోట్ల కుర్చీలు విరిగిపోయి కూర్చోవడం కష్టంగా మారింది. కొన్నిచోట్ల నల్లాలు సైతం రాకపోవడంతో ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు చెబుతున్నారు.తాగునీటికి ఇబ్బందిగా ఉంది- పెద్దపల్లి రాజేంద్రప్రసాద్, సంగెం, ప్రయాణికుడుసంగెం నుంచి జనగామకు పనిపై వచ్చాను. తిరిగి రైల్లో వరంగల్ వెళ్లడానికి స్టేషన్‌కు వచ్చా. ప్లాట్‌ఫామ్‌ల పైన ఉన్న తాగునీటి కుళాయిల్లో నీరు రావడం లేదు. మాలాంటి పేదోళ్లం రూ.20 చెల్లించి నీళ్ల సీసా కొనలేం. ఎండాకాలం గొంతు తడపడానికి స్టేషన్‌లో నీళ్లు లేవు. మరుగుదొడ్లకు తాళం వేశారు- అల్లిబిల్లి లక్ష్మి, తరిగొప్పల, ప్రయాణికురాలు ప్లాట్‌ఫామ్‌ల పైన ఉన్న మరుగుదొడ్లకు తాళాలు వేశారు. రైలు కోసం వేచి చూసే సమయంలో మరుగుదొడ్డికి వెళ్లాలంటే సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఇంత పెద్ద స్టేషన్‌లో మరుగుదొడ్లను వినియోగించకుండా తాళం ఎలా వేశారో తెలియడం లేదు.

# చివరికి అందని సాగునీరు

కోరుట్ల : 'శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కోసం విలువైన భూములను త్యాగం చేసిన నిర్వాసితులకు నేడు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. పునరావాస గ్రామాల అన్నదాతలు పంటలు పండించుకోవడానికి సాగునీరు అందక అష్టకష్టాలు పడుతున్నారు. వీరితో పాటు మరిన్ని గ్రామాలకు సాగునీరు అందడంలేదు. ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ఎస్సారెస్పీ అధికారులతో పాటు ఈ ప్రాంత ప్రజాప్రతినిధులకు సమస్యను విన్నవిస్తున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యాడు.'మల్లాపూర్ మండలంలో ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి గ్రామాలైన సంగెం, శ్రీరాంపూర్, రత్నాపూర్, కొత్తదాంరాజుపల్లి, పాతదాంరాజుపల్లి, వెంపల్లి, వెంకట్రావుపేట గ్రామాల్లోని వందలాది ఎకరాలకు ఏళ్ల తరబడి సాగునీరు అందకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంటలను సాగు చేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎస్సారెస్పీ ప్రధాన కాలువ నుంచి డీ29 కాలువ ద్వారా మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలకు సాగునీటిని సరఫరా చేస్తున్నారు. కాల్వ పై భాగంలో ఉన్న ముత్యంపేట, రాఘవపేట, సిరిపూర్, చిట్టాపూర్, సిరిపూర్ గ్రామాల వరకు మాత్రమే నీరు వస్తుంది. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయబావులు నిండితే తప్ప పంటలను సాగుచేసుకోలేని స్థితిలో అన్నదాతలు ఉన్నారు. మండలంలోని మొగిలిపేట పెద్దచెరువు కిందిభాగంలో ఉన్న కాలువ లైనింగ్ పనులు చేపట్టేందుకు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం రూ.2 కోట్లను మంజూరు చేయగా పనులు దక్కించుకున్న గుత్తేదారు రెండు కిలోమీటర్ల మేర పనులు చేపట్టి మరో నాలుగు కిలోమీటర్లు లైనింగ్ చేపట్టకుండా వదిలేశారు. లైనింగ్ లేకపోవడం, భారీ వర్షాలకు గండ్లు పడటంతో వరద నీరు కాలువలోకి వచ్చి గోదావరిలో కలుస్తుంది. ఆయకట్టు చివరి పరిధిలోని దెబ్బతిన్న కాలువలకు లైనింగ్ పనులు చేపట్టడంతో పాటు డీ29 కాలువ ఎగువ భాగంలో ఉన్న తూంలకు షట్టర్లు అమర్చితే సాగునీరు అందే పరిస్థితులున్నాయి.

కోరుట్ల మండలంలో..కోరుట్ల మండలంలోని ఐలాపూర్, కల్లూర్, ధర్మారం, కిషన్‌రావుపల్లె గ్రామాల్లో దాదాపు 340 ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితులు నెలకొన్నాయి. పలుమార్లు ఈ ప్రాంత ప్రజలు చేస్తున్న విన్నపాలను దృష్టిలో ఉంచుకుని గతేడాది ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కాలువలను స్వయంగా పరిశీలించి చివరి ఆయకట్టుకు నీరందేలా చర్యలు తీసుకోవాలని సూచించినప్పటికీ అధికారుల పట్టింపు ధోరణి కారణంగా ఇప్పటికి సాగునీరు అందడం లేదు.

# తెల్ల చీటీలే.. తక్‌పట్టీలు!



వరంగల్ : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలోని మామిడి మార్కెట్‌లో నకిలీ తక్‌పట్టీలతో కొనుగోళ్లు సర్వసాధారణమయ్యాయి. మార్కెట్ కమిటీ ముద్రించిన తక్‌పట్టీలకు బదులు తెల్లచీటీలతో దళారులు మామిడి పంటను కొనుగోళ్లు చేస్తూ.. జీరో దందాకు తెరలేపుతున్నారు. తద్వారా అటు రైతును మోసగిస్తూ ఇటు మార్కెట్ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. ఏటా మార్చి నుంచి జూన్ వరకు ఉమ్మడి జిల్లా నుంచి పెద్దఎత్తున రైతులు మామిడి పంటను మార్కెట్‌కు తీసుకొస్తారు. వ్యాపారులు పంట కొనుగోలుచేసే సమయంలో వచ్చిన సరకు వివరాలు, రైతులకు చెల్లించాల్సిన మొత్తాన్ని, అడ్తీ కమీషన్ వివరాలను మార్కెట్ కమిటీ ఇచ్చిన తక్‌పట్టీలో నమోదుచేసి రైతుకు, మార్కెట్ కమిటీకి నకలు పట్టీ అందించాల్సి ఉంటుంది. నమోదు చేసిన పంట విలువ ఆధారంగా మార్కెట్ కమిటీకి ఒక శాతం రుసుం వ్యాపారులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ తక్‌పట్టీకి బదులు దళారులు తెల్లకాగితాలపై సరకు వివరాలు నమోదు చేసి రైతుల చేతిలో పెడుతున్నారు. పంట ఉత్పత్తులను విక్రయించినందుకు నిబంధనల మేరకు రైతు నుంచి 2 శాతం కమీషన్ తీసుకోవాల్సి ఉండగా.. కొందరు 4 నుంచి 6 శాతం వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్‌కు అందించాల్సిన తక్‌పట్టీ నకలులో 2 శాతమే రైతు నుంచి కమీషన్ తీసుకుంటున్నట్లు నమోదు చేస్తున్నారు. కొనుగోలు సమయంలో చెప్పిన ధరకు కాకుండా సరకు గోదాం చేరాక.. కొర్రీలు పెడుతూ తగ్గిస్తున్నారు.

కమిటీతోపాటు రైతులకూ నష్టమే..

మార్కెట్ కమిటీ పేరుతో ఉన్న తక్‌పట్టీలకు బదులు నకిలీవి వినియోగించడం ద్వారా మార్కెట్ కమిటీ ఆదాయానికి గండిపడడంతో పాటు రైతులకు నష్టం వాటిల్లుతోంది. పంట ఉత్పత్తుల వివరాలు, కొనుగోలు చేసిన వ్యాపారి, అడ్తీదారు సంతకంతో కూడిన తక్‌పట్టీ రైతు వద్ద ఉండడం వల్ల మార్కెట్ నుంచి రైతుకు ఇంటికి వెళ్లే క్రమంలో ఎలాంటి ప్రమాదం జరిగినా.. ప్రమాద తీవ్రతను బట్టి రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు మార్కెట్ కమిటీ చెల్లిస్తుంది. ఈ పరిహారం చెల్లింపులో రైతుకు సంబంధించిన వారు తప్పనిసరిగా అసలు తక్‌పట్టీని మార్కెట్ కమిటీకి సమర్పించాల్సి ఉంటుంది. లేనిపక్షంలో పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం తెల్లచీటీలతో రైతులకు ఎలాంటి ప్రయోజనం సమకూరే అవకాశం లేదు. ఇలా తెల్లకాగితాలపై సరకు వివరాలతో ప్రతిరోజు రూ.లక్షల్లో జీరో వ్యాపారం కొనసాగుతున్నా.. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం.

దళారులే శాసిస్తున్నారు...

లక్ష్మీపురంలో మార్కెట్ కొనసాగినప్పుడు 2021-22 సీజన్‌లో 2,71,575 క్వింటాళ్ల సరకు కొనుగోళ్లు జరిగినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. సమీకృత మార్కెట్ నిర్మాణ సమయంలో మామిడి మార్కెట్ గతేడాది మార్చిలో లక్ష్మీపురం నుంచి ధర్మారంలోని మూతబడిన జానకీరాం రైస్‌మిల్లుకు తరలివెళ్లిన తర్వాత 77,999 క్వింటాళ్లకు పడిపోయింది. ఈ ఏడాది 50 వేల క్వింటాళ్లు మించే అవకాశాలు కనిపించట్లేదు. మార్కెట్‌కు వచ్చే సరకును నకిలీ తక్‌పట్టీలతో తక్కువగా చూపిస్తూ.. మార్కెట్ ఆదాయానికి దళారులు గండి కొడుతున్నారు. మొత్తం మార్కెట్ నిర్వహణను కేవలం ఒకే ఒక సూపర్‌వైజర్‌పై వేసి మార్కెట్ ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు. సూపర్‌వైజర్ పర్యవేక్షణ చేయలేకపోవడంతో రైతులను దోపిడీకి గురిచేస్తూ.. దళారులు మామిడి మార్కెట్‌ను శాసిస్తున్నారు.

# విత్తన మాయగాళ్లొస్తున్నారు.. జాగ్రత్త..!



మహబూబాబాద్ : ఈ నెల 25 రోహిణి కార్తె ఆరంభం.. వానాకాలం సీజన్ ప్రారంభానికి సంకేతం. పత్తి, మిర్చి, వరి విత్తనాల కోసం రైతులు ఇబ్బందులు పడుతుంటారు. వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ విత్తన వ్యాపారులు రంగంలోకి దిగుతుంటారు. పేరు, ఊరు లేనివి మంచి కంపెనీకి చెందినవంటూ అంటగట్టి చిరునామా లేకుండా జారుకుంటారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఏటా నకిలీ, అనుమతి లేనివి అంటగట్టే మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. టాస్క్‌ఫోర్స్ బృందాలు తిరుగుతున్నా అవేవీ పట్టించుకోకుండా యథావిధిగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం..

పత్తిలో చిత్తు కావొద్దు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 5.50 లక్షల ఎకరాల్లో పత్తిసాగవుతుందని అంచనా. ఎకరాకు 850 గ్రాముల నుంచి కిలో వరకు విత్తనాలు అవసరం. తొలుత నాటిన వాటిల్లో కొన్ని మొలకెత్తకుంటే పోగుంటలు విత్తుకోవడానికి కూడా అవసరమవుతాయి. ఎకరాకు కిలో లెక్కన పరిగణనలోకి తీసుకుంటే 5.50 లక్షల కిలోలు అవసరం. ఒక్కో ప్యాకెట్(450 గ్రాములు)ధర రూ.800. ఈ లెక్కన రూ.97 కోట్ల పత్తి విత్తనాల వ్యాపారం జరుగుతుంది. వీటిలోనూ నాసిరకమైనవి ఉంటాయి.

రూ.కోట్లలో వ్యాపారం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈసారి 1.40 లక్షల ఎకరాల్లో మిరప సాగవుతుందని అంచనా. ఇందుకు 14 టన్నుల విత్తనాలు అవసరం. ఈమేరకు రూ.120 కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఇందులో 40 శాతం నకిలీ విత్తన వ్యాపారుల వాటా ఉంటుందని అనుమానిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి నారు సైతం తెచ్చి విక్రయిస్తుంటారు. అధికశాతం గుంటూరు ప్రాంతం నుంచే వస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

టాస్క్‌ఫోర్స్ బృందాలు ..

ఉమ్మడి జిల్లాలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు ప్రతి మండలానికి, సబ్‌డివిజన్ పరిధిలోనూ దుకాణాలను తనిఖీ చేసేందుకు బృందాలున్నాయి. మండల పరిధిలో ఎస్సై, మండల వ్యవసాయాధికారి, సబ్‌డివిజన్ పరిధిలో డీఎస్పీ, ఏడీఏ స్థాయి అధికారి, జిల్లా స్థాయిలో ఎస్పీ, జిల్లా వ్యవసాయాధికారి ఉంటారు.

అన్నదాతలు ఇవి చూసుకోండి అధీకృత దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలి సంచులపై లాట్ నెంబరు, కంపెనీ పేరు, డేట్ ఆఫ్ ప్యాకింగ్, లేబుల్, విత్తన మొలక శాతం సరిగా ఉందో..? లేదో..? చూసుకోవాలి. రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి. అప్పుడే నష్టపోయినప్పుడు పరిహారం పొందడానికి అవకాశం ఉంటుంది. సంచులపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. దానిని మొబైల్ స్కానర్ ద్వారా స్కాన్ చేసి విత్తనాలకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు.

వ్యాపారులు ఇవి పాటించాల్సిందే.. వ్యవసాయశాఖ ఇచ్చిన లైసెన్స్ పరిధిలోనే అమ్మకాలు చేపట్టాలి ఏ కంపెనీకి చెందినవి అమ్ముతున్నారో దానికి సంబంధించిన ప్రిన్సిపుల్ సర్టిఫికెట్ (పీసీ) అందుబాటులో ఉండాలి. ప్రతి రోజు స్టాక్ వివరాలను బోర్డుపై నమోదు చేస్తూ అది అందరికీ కనిపించేలా దుకాణాల్లో ఏర్పాటు చేయాలి లేబుల్ ఉన్నవి మాత్రమే అమ్మాలివిక్రయించిన ప్రతి దానికి రసీదు ఇవ్వాలి. అందులో లాట్ నెంబరు రాసి ఉండాలి.

ప్రభుత్వం ఇలా చేస్తే మేలు నకిలీవి విక్రయించిన, తయారు చేసిన వారిపై కఠిన చర్యలు ఉండేలా పటిష్ఠమైన చట్టాన్ని రూపొందించాలి. ఈ కేసుల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను అందుబాటులోకి తీసుకురావాలి. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం చెల్లించాలి.ఇది వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉమ్మడి ఎల్లాయిగూడెం పంచాయతీ పరిధిలోనిది. గత వానాకాలంలో 35 మంది రైతులు 200 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. వరంగల్‌లోని ఓ దుకాణదారుడు కొత్తరకం విత్తనాలంటూ విక్రయించారు. సాగు చేస్తే పంట ఎదుగుదల బాగానే ఉన్నప్పటికీ ధాన్యం గొలుసులు ఆశించిన స్థాయిలో రాలేదు. నాసిరకంతో నష్టపోయామంటూ రైతులు అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు పంటక్షేత్రాలను పరిశీలించి వెళ్లారు. పరిహారం ఇప్పటికీ రాలేదు.

దిగుబడి రాక నష్టపోయాను-బోడ రవి, చెన్నారావుపేట

గత వానాకాలంలో వరంగల్‌లోని ఓ దుకాణంలో మూడెకరాలకు కావాల్సిన వరి విత్తనాలను కొనుగోలు చేశాను. అవి నాసిరకం కావడంతో సరిగా దిగుబడి రాలేదు. ఏటా పంటను విక్రయిస్తే ఖర్చులు పోనూ రూ.50 వేలు మిగిలేవి. అలాంటిది మొత్తం రూ.45 వేలే వచ్చాయి. అధికారులకు చెప్పినా ప్రయోజనం లేదు. దాంతో యాసంగిలో జాగ్రత్తగా పరిశీలించి కొనుగోలు చేశాను.

బిల్లుల విషయంలో అప్రమత్తత అవసరం- కె.సూర్యనారాయణ, ఉద్యానశాఖ అధికారి, మహబూబాబాద్

గ్రామాల్లోకి బయటి నుంచి వచ్చి తమ విత్తనాలను కొనండి.. గతేడాది బాగా దిగుబడులు వచ్చాయంటూ చెప్పి విక్రయిస్తారు. బిల్లులు ఇచ్చినా అందులో వాళ్లకు సంబంధిన చిరునామా ఉండదు. వాటిని సాగు చేసి పంట నష్టం జరిగితే ఎలాంటి ప్రయోజనాలు పొందలేరు. తనిఖీలు చేపట్టి రైతులను మోసగించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

సమాచారం ఇవ్వండి... బహుమతి అందుకోండి

నకిలీ విత్తనాలు విక్రయించే వారి సమాచారం ఇస్తే తగిన పారితోషికం అందిస్తామని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా వ్యాపారులు, సంస్థలు నకిలీ విత్తనాలను విక్రయిస్తే స్థానిక పోలీసులు, లేదా కమిషనర్ చరవాణి 87126-85100, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ 87126-85148, ప్రత్యేక విభాగం ఏసీపీ 87126-85101 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బడులకు భద్రత ఏదీ?

కరీంనగర్ : పోలీస్ పరేడ్ మైదానాన్ని ఆనుకొని ఉన్న ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మే మొదటి వారంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి రూ.4 లక్షల క్రోమ్ బుక్స్‌ను ఎత్తుకెళ్లారు. గతంలోనూ ఇదే పాఠశాలలో నాలుగైదు సార్లు దొంగతనానికి పాల్పడి విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు.

ఈ పరిస్థితి ఈ ఒక్క పాఠశాలలోనే కాదు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకొంది. కొన్ని బడుల్లో చోరీలు వెలుగులోకి వస్తుండగా, మరికొన్ని రావడం లేదు. విలువైన పరికరాలను ఆకతాయిలు ధ్వంసం చేస్తున్నారు. ఫలితంగా విద్యార్థులకు సదుపాయాలు సన్నగిల్లే పరిస్థితి నెలకొంది. సెలవులు వస్తే చాలు సర్కారు బడుల ఆస్తులకు భద్రత కరవయ్యే పరిస్థితి నెలకొంది. ఓ వైపు మన ఊరు-మన బడి పథకం కింద సదుపాయాలు అభివృద్ధి చేస్తుండగా, మరో వైపు దాతల సహకారంతో డిజిటల్ తరగతులు, ఇతరత్రా సామగ్రి సమకూరుతోంది. సెలవులు వస్తే తాళాలు వేస్తుండటం, గ్రామాల్లో ఓ మూలన ఉండటంతో ఆకతాయిలకు అడ్డాలుగా మారుతున్నాయి. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడటంతోపాటు మద్యం తాగడం, సామగ్రిని ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం వంటివి జరుగుతున్నాయి. మరో వైపు ఇటీవల మన ఊరు-మన బడి పథకం కింద సదుపాయాలు సమకూరిన ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌లను నియమించుకోవాలని ఈనెల మొదటి వారంలో రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎంపిక చేసిన పాఠశాలల్లో వారిని నియమించుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో కొన్ని చోట్ల నియమించుకోలేదు.152 మంది నైట్ వాచ్‌మెన్లు...ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మన ఊరు-మన బడి పథకం కింద వందలాది పాఠశాలలను అభివృద్ధికి ఎంపిక చేశారు. కొన్నింట్లో పనులు ముగింపు దశలో ఉండగా, మిగిలిన వాటిల్లో కొనసాగుతున్నాయి. లక్షల వ్యయంతో కల్పిస్తున్న సౌకర్యాలను సెలవు దినాల్లో కాపాడేందుకు పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 152 పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌ల నియామకానికి రాష్ట్ర విద్యాశాఖ అనుమతి ఇచ్చింది.

# ఇసుక రీచుల్లో ఇష్టారాజ్యం!

జయశంకర్ భూపాలపల్లి: ఇసుక తవ్వకాలు, విక్రయాలతో ప్రాజెక్టులు, భవనాలు, రహదారుల నిర్మాణాలు, ఇతర అవసరాలు తీరడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. అలాగే స్థానికంగా కూడా ఉపాధి కలుగుతుందని ప్రభుత్వం ఇసుక రీచులను ఏర్పాటు చేస్తోంది. లభ్యత ఉన్నచోట స్థానికులకు భాగస్వామ్యం కల్పించడం, సంఘాలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించి టీఎస్ఎండీసీ ఆధ్వర్యంలో క్వారీలను నిర్వహిస్తున్నారు. అయితే ఇసుకకు ఉన్న డిమాండ్‌తో కొందరు అక్రమార్కులు పక్కదారి పట్టిస్తున్నారు. వక్రబుద్ధిని చూపించి ప్రభుత్వాన్నే మోసం చేస్తున్నారు. నకిలీ వేబిల్లులు తయారు చేయడం, గుట్టుచప్పుడు కాకుండా పర్మిట్లు లేకుండానే తరలించడం, రాత్రిళ్లు తవ్వకాలు, లోడింగ్ చేయడం, తదితర అక్రమాలకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ జేబులు నింపుకుంటున్నారు.

తనిఖీలు నామమాత్రం!

ఇసుక రవాణా సక్రమంగా జరుగుతుందా లేదా అని కనీస తనిఖీలు కరవయ్యాయి. గతంలో రెండు మూడు చోట్ల టీఎస్ఎండీసీ సిబ్బంది, పోలీసులు, రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టేవారు. ఇటీవల తనిఖీలు చేయడమే మానేశారు. దీంతో అనుమతులున్న వాహనం



ఏది లేనిది ఏదో కూడా తెలియడం లేదు. యథేచ్ఛగా అక్రమ రవాణా సాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమాలపై చర్యలు తీసుకుని, పారదర్శకంగా నిర్వహించేలా చూడాల్సిన అవసరం ఉంది.

రెండు జిల్లాల్లో అక్రమ రవాణా

ములుగు జిల్లాలోని మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాల్లో 6 ఇసుక రీచులు ఏర్పాటు చేశారు. వీటి నుంచి నిత్యం 600 లారీలు లోడింగ్ అవుతుంటాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహదేవపూర్, మల్హర్, చిట్యాల మండలాల్లో 5 రీచులు ఏర్పాటు చేశారు. వాటిల్లో నిత్యం 500 లారీల వరకు లోడింగ్ అవుతున్నాయి. రీచులపై పర్యవేక్షణ కరవైందని ఇటీవల జరిగిన పలు ఘటనలే స్పష్టం చేస్తున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

ఇసుక అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఆన్‌లైన్ విధానాన్ని తీసుకొచ్చింది. టీఎస్ఎండీసీ ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఏరోజుకారోజు రీచుల వారీగా ఇసుక నిల్వలు కేటాయిస్తుంది. అవసరం ఉన్నవారు క్యూబిక్ మీటరుకు రూ.600 చొప్పున చెల్లించి స్లాట్ బుకింగ్ చేసుకుంటారు. అనంతరం రీచులకు వెళ్లి లోడింగ్ చేసుకుని, అధికారుల పర్యవేక్షణలో వేబిల్లులతో లారీలు గమ్యస్థానాలకు బయలుదేరుతాయి. కాని కొన్ని రీచుల్లో డీడీలు చెల్లించకుండానే, పర్మిట్లు లేకుండానే అక్కడి నిర్వాహకులు, సిబ్బందితో కుమ్మక్కై నేరుగా లోడింగ్ చేస్తున్నారు. నకిలీ వేబిల్లులతో ఇసుకను లోడింగ్ చేసుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అలాగే లోడింగ్ పాయింట్ వద్ద కూడా అదనపు బోకెట్కు రూ. 2 వేల వరకు వసూలు చేస్తున్నారు. రవాణాశాఖ అధికారులు లారీలను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా తీరు మారడం లేదు. అక్రమాలను రీచుల వద్దే అరికట్టడానికి టీఎస్ఎండీసీ సిబ్బందిని ఏర్పాటు చేశారు. వారున్నా కూడా అక్రమాలు ఆగడం లేదు.

పట్టుబడిన ఘటనలు

గత నెలలో ములుగు జిల్లాలోని ఇసుక క్వారీల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా, నకిలీ వే బిల్లులతో ఇసుక తరలిస్తున్న 16 లారీలను వరంగల్ పోలీసులు పట్టుకున్నారు. 9 మందిపై కేసులు నమోదు చేశారు. ఆరా తీయగా మూడేళ్ల నుంచి 1700 నకిలీ వేబిల్లులతో రూ. 30 కోట్ల వరకు కొల్లగొట్టినట్లు పోలీసులు అంచనా వేశారు. ఇటీవల మల్హర్ మండలంలోని మల్లంపల్లి, తాడిచర్ల రహదారిలో ఇసుక లారీలు పెద్ద ఎత్తున నిలపడంతో అటువైపుగా వెళ్తున్న జయశంకర్ జేసీ స్వర్ణలత పరిశీలన చేశారు. లారీని పరిశీలించగా పరిమితికి మించి తరలిస్తున్నట్లు కనిపించడంతో చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇటీవల మహదేవపూర్ మండలం కుంట్లం ఇసుక క్వారీ నుంచి గోదావరి మీదుగా రహదారి వేసుకుని అవతలి వైపు తరలిస్తున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తమ భూములను లీజుకు తీసుకుని సకాలంలో డబ్బులు చెల్లించడం లేదని సైతం ఫిర్యాదు చేశారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలన చేశారు.

# ప్రాంగణాల్లో క్రీడల్!

కరీంనగర్ వేసవి సెలవులు రావడంతో చిన్నారులు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ ఆటల్లో మునిగి తేలుతున్నారు.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పల్లె, పట్టణ క్రీడా ప్రాంగణాల్లోని మైదానాలు మాత్రం సందడితో లేవు.. సౌకర్యాల లేమి.. గ్రామాలకు దూరంగా ఉండటం తదితర కారణాలతో ఉపయోగించుకోలేని పరిస్థితి తలెత్తుతోంది.

రూ.31.83 కోట్ల వ్యయం..

గ్రామాల్లో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని 2022 మే 18న సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. గ్రామానికి ఒకటి చొప్పున, పురపాలికలు, కార్పొరేషన్లలో వార్డులు, డివిజన్‌కు జనాభాను బట్టి ఒకటి లేదా రెండు చొప్పున వీటిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఒక్కోదానికి రూ.3-5 లక్షల వరకు నిర్మాణ వ్యయాన్ని వెచ్చించారు. గతేడాది జూన్ 2వ తేదీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వీలైనన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పడంతో ఉమ్మడి జిల్లాలో 40 చోట్ల అట్టహాసంగా వీటిని ప్రారంభించారు. తరువాత ఆగమేఘాల మీద నెలన్నర రోజుల్లోనే 400కుపైగా ఏర్పాటు చేశారు. తరవాత వర్షాకాలంలో పెద్ద వానలకు చాలాచోట్ల ఇవి వాటి రూపును కోల్పోయాయి. చెరువు శిఖం స్థలంతోపాటు ఇతర లోతట్టు ప్రాంతాల్లో వీటిని నిర్మించడంతో నీరు చేరి వినియోగించుకోలేని పరిస్థితి తలెత్తింది. నాలుగు జిల్లాల పరిధిలో 1061 చోట్ల వీటిని ఏర్పాటు చేసి సుమారుగా రూ.31.83 కోట్లు ఖర్చు చేశారు.ఇబ్బందులనేకం.. చాలాచోట్ల ఊరికి దూరంగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. రాళ్ల మధ్యన గుట్టల చెంతన ఉండటంతో అక్కడికి వెళ్లి ఆటలాడే పరిస్థితి లేదు.కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వీటి స్థలాన్ని వినియోగిస్తున్నారు. ఎక్కువ ప్రాంగణాల్లో బోర్డులు మాత్రం పెట్టి మిగతా ఆటలకు చెందిన ఉపకరణాల్ని అమర్చకుండా అలాగే వదిలేయడంతో వినియోగించుకోలేని పరిస్థితి. ఎక్కువగా పల్లెల్లో చెరువు శిఖం స్థలాలు, లోతట్టు ప్రాంతాలను అప్పటికప్పుడు మైదానాలుగా మార్చి మమ అనిపించారు. వసతుల్ని మరిచారు. చదును చేయకుండానే వదిలిపెట్టడంతో మైదానాలు ఎగుడు దిగుడుగానే ఉన్నాయి.

# హే.. భగవాన్..!

ఖమ్మం : నిన్నమొన్నటి దాకా..: ఇది వానాకాలమా? ఎండాకాలమా? అన్న సందేహం. ఉదయం పూట మబ్బులు.. ఆపై చిటపట చినుకులు.. మధ్యాహ్నం దాటిందంటే గాలివానలకు ఎగిరిన పైకప్పులు, తడిసిన ధాన్యపు రాశులు, రాలిన మామిడి ఫలాలు, రైతుల తిప్పలు.. రోజూ ఇదే రివాజు. ఏప్రిల్ చివర్లోనూ కూలర్ వేసుకొని నిద్రిస్తే చలిపుట్టేది. జిల్లావాసులు పొందిన చల్ల'ధనం' ఎంతంటే ఏసీ వ్యాపారులు ఎండల కోసం ఎదురుచూసేంత.. గత వారం వ్యవధిలో పరిస్థితి తారుమారైంది.

మరి నేడు..: వరుణుడు మాయమయ్యాడు. భానుడు భగభగమంటున్నాడు. ఇంటిమీద ఏదో కుంపటి పెట్టినట్టుంది. ఒంటిపై చెమట దుప్పటి కప్పినట్టుంది.. అవసరంకొద్దీ బయటకెళ్తే ప్రచండ భానుడు వడగాలులతో దడ పుట్టిస్తున్నాడు.. గంటలు పెరిగేకొద్దీ మంటలు పుట్టిస్తున్నాడు. ఉదయం, సంధ్యాసమయం.. రెండూ మధ్యాహ్నంలా అనిపిస్తుంటే ఇక పట్టపగలైతే నిప్పులు కురుస్తున్నాయి. ఎండలు కరుస్తున్నాయి. బయకెళ్తే ఎప్పుడు కాలికి పనిచెబుదామా అన్నట్టు ఒళ్లు కాలిపోతోంది.. పొద్దంతా ఆకాశం నుంచి ప్రకోపించిన సూర్యుడు రాత్రి వేళలో అవని నుంచి ఉష్టం పెంచి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు..




ఒంట్లో నీటిని లాగేయటంతో నిస్సత్తువ ఆవహిస్తోంది. పిల్లలు, వృద్ధులైతే ఉడ్డుకూరుస్తున్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

పూర్వ ఖమ్మం జిల్లాలో వారం రోజులుగా ఊహించని రీతిలో ఎండవేడి జనాన్ని నీరసింపజేస్తోంది. విపరీత చెమటలతో డీహైడ్రేషన్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఎండదెబ్బతో బాధపడుతూ చాలామంది ప్రభుత్వ ఆసుపత్రుల బాటపడుతున్నారు. అధికారికంగా వడదెబ్బ మృతుల సంఖ్య ఉభయ జిల్లాల్లో నమోదు కాకున్నా ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, టీవీపీఎస్ ఆసుపత్రుల తోపాటు అన్ని సబ్‌సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. అదనంగా జిల్లాలో 50వేల ఓఆర్ఎస్ ప్యాకెట్లను నిల్వ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. వేడి సెగలతో సముద్రతీర ప్రాంతాల్లో మాదిరిగా శరీరం ఉడికిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బయటకు వెళ్లేప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ జాగ్రత్తలు మరవొద్దు ఉదయం పది గంటల తరువాత బయటకు వెళ్లొద్దు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే కాటన్ దుస్తులు ధరించాలి. చెవుల్లో దూది ఉంచుకోవాలి. తలకు పూర్తి రక్షణ ఉండాలి. గొడుగులు ఉపయోగించాలి. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు చెవులకు, తలకు రక్షణతోపాటు తాగునీటిని అందుబాటులో ఉంచుకోవాలి. వృద్ధులు, గర్భిణులు, చిన్న పిల్లలు ఎండ సమయంలో బయట ఉండొద్దు. శీతల పానీయాలు, జంక్ ఫుడ్ తినడం ప్రమాదకరం.మజ్జిగ, నిమ్మరసం తరచూ తీసుకోవటం ద్వారా డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండొచ్చు.

ఖమ్మం"పర్యావరణ సమతుల్యత దెబ్బతినడంతో వాతావరణంలో విచిత్ర పరిస్థితులు చూస్తున్నాం. అకస్మాత్తుగా వర్షం పడటం, ఒకటి, రెండు రోజుల్లోనే ఎండల తీవ్రత పెరగడం, శరీరం ఉడికిపోవడం వంటి పరిస్థితులు ఎదుర్కొంటున్నాం. ఇది చాలా ప్రమాదకర సూచన. ప్రజలు పూర్తిగా రక్షణ చర్యలతో కూడిన జాగ్రత్తలు పాటించాలి."డాక్టర్ జేవీఎల్.శిరీష, భద్రాద్రి డీఎంహెచ్ఓ

# అమ్మ కడుపులోనే అంతం!

కరీంనగర్ : గర్భస్థ లింగ నిర్ధారణ నేరం అని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో.. ఆస్పత్రుల్లో బోర్డు కనిపిస్తుంది.. కానీ కొన్ని కేంద్రాలు.. ఆస్పత్రులు గుట్టుచప్పుడు కాకుండా ఆ నేరం చేస్తున్నాయి.. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ కాసుల కక్కుర్తితో కేంద్రాల నిర్వాహకులు.. వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఆ వృత్తికే కళంకం తెస్తున్నారు.. వైద్యారోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆడశిశువులు భ్రూణహత్యకు గురవుతున్నారు.

జమ్మికుంటలో సోమవారం ఓ ప్రభుత్వ వైద్యురాలే తన ప్రైవేటు ఆస్పత్రిలో గర్భస్థ లింగ నిర్ధారణ చేయడంతోపాటు గర్భవిచ్ఛిత్తి చేసినట్లు వెలుగులోకి రావడం యంత్రాంగం ఎంత మొద్దు నిద్ర పోతోందో తేటతెల్లం చేస్తోంది.కరీంనగర్ మంకమ్మతోటలోని ఓ స్కానింగ్ కేంద్రంపై 2017 జులై చివరి వారంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, వైద్యారోగ్యశాఖ అధికారులు దాడి చేసి లింగ నిర్ధారణ చేస్తున్నట్లు గుర్తించారు. జమ్మికుంటలోనూ కొన్నాళ్లకు ఇదే తరహా ఆరోపణలు రావడంతో ఓ ప్రైవేటు ఆస్పత్రిని మూసివేయించారు. తాజాగా ఇదే జమ్మికుంటలో జరుగుతున్న తంతును ఆధారాలతో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో డొంక కదిలింది. వెలుగు చూడనివి ఇంకా ఎన్నో ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అధికారులు తరచూ తనిఖీలు చేస్తేనే ఈ అక్రమాలు బయటపడే అవకాశముంది. సగటున నెలకు ఒక్క కరీంనగర్ జిల్లాలోనే 1,560 మంది గర్భిణులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పరీక్షల కోసం వస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ లెక్కన నాలుగు జిల్లాల పరిధిలో దాదాపుగా 5 వేలకుపైగా గర్భిణులుంటారని అంచనా. వీరిలో కొంతమంది మాత్రమే జిల్లా కేంద్రాల్లో ఉన్న ఎంసీహెచ్‌లకు స్కానింగ్ కోసం వస్తుండగా ఎక్కువ శాతం మంది ప్రైవేటు ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ నెల 11వ తేదీ వరకు కరీంనగర్ ఎంసీహెచ్‌లో 4,351 మంది బాలురు పుడితే.. 3928 మంది బాలికలు జన్మించారు. జగిత్యాల జిల్లాలో 3,660 మంది మగపిల్లలు జన్మిస్తే 3,505 మంది ఆడపిల్లలు పుట్టారు. సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లోనూ మగపిల్లలే అధికంగా ఉంటున్నారు. ప్రైవేటు ఆస్పత్రుల జనన నిష్పత్తి విషయంలో ఈ వ్యత్యాసం ఎక్కువగా ఉంటున్నట్లు వైద్యారోగ్యశాఖ దృష్టికొచ్చింది. పుట్టేది ఆడ బిడ్డనా.. మగబిడ్డా చెప్పడానికి రూ.10 వేల వరకు కొన్ని స్కానింగ్ కేంద్రాలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. నేరుగా కాకుండా కొందరు ఏజెంట్ల సాయంతో ఈ దందాను సాగిస్తున్నారు. కోడ్ భాషలో రహస్యంగా మధ్యవర్తులకు మాత్రమే విషయాన్ని చెబుతున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో పుట్టగొడుగుల్లా స్కానింగ్ కేంద్రాలు వెలుస్తున్నాయి. కరీంనగర్ జిల్లాలో రికార్డు స్థాయిలో 107 స్కానింగ్ కేంద్రాలున్నట్లు వైద్యారోగ్య శాఖ వర్గాల గణాంకాలు చెబుతున్నాయి. మిగతా మూడు జిల్లాల్లో కలిపి 150 వరకున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల పర్యవేక్షణలో ఉన్నవి 20 లోపు ఉండటం గమనార్హం. మిగతావన్నీ ప్రైవేటువే.! వీటిలో చాలావరకు అనుమతిలేనివే కొనసాగుతుండటం గమనార్హం.ధికారులేమంటున్నారంటే.. : కరీంనగర్ జిల్లాలో అన్ని స్కానింగ్ కేంద్రాలపై ప్రత్యేకమైన నిఘా పెడతామని డీఎంహెచ్‌వో లలితాదేవి తెలిపారు. కమిటీలను ఏర్పాటు చేసి పర్యవేక్షణను పెంచుతామన్నారు.

పర్యవేక్షణ ఊసే లేదు.! గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గర్భం దాల్చిన వారి వివరాల్ని వైద్యారోగ్యశాఖ సిబ్బంది సమగ్రంగా సేకరిస్తారు. గుర్తించిన గర్భిణుల సంఖ్యను.. ప్రసవాలతో పోలిస్తే గర్భ స్రావాలు.. గర్భవిచ్ఛిత్తి ఉదంతాలు బయటపడే అవకాశముంది. కానీ ఈ దిశగా యంత్రాంగం దృష్టి సారించడంలేదు. ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలకు వస్తున్న గర్భిణుల వివరాలు నమోదు చేయించి.. ఆ వివరాలను ప్రసవాల సంఖ్యతో సరిపోల్చడం ద్వారానూ ఎక్కడైనా అక్రమాలు జరిగితే గుర్తించవచ్చు.

# గుత్తేదారుల గలీజు దందా..!



మణుగూరు : గోదావరి నదిపై ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి రైతులు తమ భూముల్ని లీజుకు ఇస్తున్నారు. అశ్వాపురం మండలం కమ్మరిగూడెం వద్ద 37 టీఎంసీల నీరు నిల్వ ఉండేందుకు సర్కారు ఆనకట్ట నిర్మిస్తోంది. దీనికి రెండువైపులా కరకట్టలను ఏర్పాటు చేస్తోంది. కరకట్టల నిర్మాణానికి నల్లరేగడి మట్టి అవసరం. ఇందుకోసం రైతులను గుత్తేదారులు ఆశ్రయిస్తున్నారు. ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు చెల్లిస్తున్నారు. కరకట్టల నిర్మాణంలో పునాది పటిష్ఠానికి, నీరు లీకవకుండా నల్లరేగడి మట్టి దోహదపడుతుంది.

రెండో'సారీ'..సీతమ్మసాగర్ ప్రాజెక్టు అవసరాల నిమిత్తం రైతుల భూముల్ని గుత్తేదారులు లీజుకు తీసుకుంటున్నారు. ప్రాజెక్టు నిర్మాణం, కరకట్టల కోసం ప్రభుత్వం ఎకరాకు రూ.8లక్షల నుంచి రూ.12 లక్షల వరకు పరిహారం చెల్లించి అన్నదాతల నుంచి భూముల్ని సేకరించింది. సర్కారు చెల్లించిన నామమాత్రపు పరిహారంపై రైతులు అసంతృప్తితో ఉన్నారు. ఉన్న కొద్దిపాటి భూముల్నీ కొందరు కరకట్టల నిర్మాణానికి అవసరమయ్యే నల్లరేగడి మట్టి కోసం లీజుకిస్తున్నారు. మరికొందరు రైతులు.. గుత్తేదారులకు విక్రయిస్తున్నారు. అన్నదాతలు మరోసారి అనధికారికంగా భూముల్ని 'సీతమ్మసాగర్' కోసం ధారాదత్తం చేస్తున్నారు.

ఇబ్బందికర పరిణామం

కరకట్టల నిర్మాణానికి సేకరించిన భూముల్లో గుత్తేదారులు 3–5 మీటర్ల లోతులో మట్టిని తవ్వనున్నారు. లీజుకు తీసుకున్న, కొనుగోలు చేసిన భూముల్లో భారీ యంత్రాలు, వాహనాలతో మట్టి తోలకాలు చేపడుతున్నారు. తవ్వకాలు జరిగిన భూముల పక్కన మట్టి, సాంద్రత నిలిచే అవకాశం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం పంట పొలాలకు 15 మీటర్ల దూరంలో మట్టి తవ్వకాలు చేపట్టాలని కోరుతున్నారు. రైతులకు అవగాహన కల్పించకుండా గుత్తేదారులు భూముల్ని తీసుకుంటున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తగ్గనున్న సాగు విస్తీర్ణం..!

సీతమ్మసాగర్ ప్రాజెక్టు నిర్మాణంతో రానున్న రోజుల్లో వ్యవసాయ భూముల్లో ఏడాదికి రెండు పంటలు పండుతాయి. ఆనకట్టతో గోదావరిలో నీరు ఎప్పటికీ నిలిచే అవకాశముంది. ఈక్రమంలో గోదావరి చెంతనే ఉన్న భూములు సస్యశ్యామలం కానున్నాయి. భవిష్యత్తు ప్రయోజనాల గురించి పూర్తిగా అవగాహన లేక కొందరు రైతులు తమ భూములను మట్టి తోలకాలకు లీజుకిస్తుండఆటంతో సాగు విస్తీర్ణం తగ్గే ఆస్కారముంది. మట్టి తోలకాలు జరిపిన భూములు కుంటలుగా మారనున్నాయి.

సీతమ్మసాగర్ కరకట్టల నిర్మాణంలో నల్లరేగడి మట్టి కోసం రైతుల అభీష్టం మేరకు గుత్తేదారులు భూముల్ని తీసుకుంటున్నారు. గుత్తేదారులు, రైతుల మధ్యే ఒప్పందం ఉంటుంది.శ్రీనివాసరావు, డీఈ

కరకట్టల ఎత్తు: 12 మీటర్లు వెడల్పు: 5–50 మీటర్లు కరకట్ట ఎడమ వైపు పొడవు: 52 కి.మీ. కుడివైపు పొడవు: 49 కి.మీ

# బిందు సేద్యం.. ఒక పంటకే పరిమితం



ఖమ్మం : సన్న, చిన్నకారు రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న 'బిందు సేద్యం' పథకం నిలిచిపోవటంతో వ్యవసాయం భారంగా మారింది. కొన్నేళ్ల నుంచి అనేక పంటలకు అమలవుతున్న ఈ పథకాన్ని ఈ ఏడాది ఒక్క ఆయిల్‌పామ్ పంటకు మినహా మిగతా వాటికి నిలిపివేసింది. గతంలో ఈ పథకం మంజూరైన అనేక మంది రైతులు తమ వాటా ధనం డీడీల రూపేణా చెల్లించి వ్యవసాయ పరికరాల కోసం ఎదురుచూస్తున్నారు.

2 వేల మంది నిరీక్షణ వ్యవసాయ రంగం బలోపేతానికి ప్రభుత్వం బిందు, తుంపర్ల సేద్యం పథకాలను అమలుచేసింది. ప్రధానంగా పత్తి, మిరప లాంటి పంటలకు వర్తింపజేయటం వల్ల రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించారు. కొవిడ్ (2020)కు ముందువరకు అన్ని పంటలకు ఈ పథకాలను ప్రభుత్వం అమలుచేసింది. రెండేళ్ల నుంచి కేవలం పండ్ల తోటలకు మాత్రమే వర్తింపజేస్తోంది. గత డిసెంబరు నుంచి పండ్ల తోటలకూ పథకాన్ని నిలిపివేసింది. తాజాగా ఒక్క ఆయిల్‌పామ్ పంటకు మాత్రం వర్తింపజేస్తోంది. వివిధ పంటలకు దరఖాస్తు చేసుకున్న సుమారు 2వేల మంది రైతులు పరికరాల కోసం నిరీక్షిస్తున్నారు.

చేతులెత్తేసిన కంపెనీలు

రెండేళ్ల కిందటి వరకు ప్రభుత్వం బిందు సేద్యం పథకం అమలుచేసినా దీనికి సంబంధించిన పరికరాలను జిల్లాకు కేటాయించిన కంపెనీలు సరఫరా చేయకపోవటం వల్ల ప్రతిష్టంభన నెలకొంది. అంతర్జాతీయంగా పెట్రోలు ధరలు పెరగటంతో పరికరాలను తయారుచేసే కంపెనీలపై ఆ ప్రభావం పడింది. మూడేళ్ల కిందట నిర్ణయించిన ధరల ప్రకారం పరికరాలను అందించలేమంటూ కంపెనీలు డ్రిప్ పరికరాలను సరఫరా చేయలేదు. జైన్, ఫినోలెక్స్, మెటాఫిన్, గ్లోబల్, స్కిప్పర్, కుమార్ కంపెనీలు గతంలో డ్రిప్ పరికరాలు అందించాయి.

ఉద్యాన రైతులకు నిరాశ

జిల్లాలో సుమారు 30వేల ఎకరాల్లో మామిడి తోటలు, 10 వేల ఎకరాల్లో ఇతర పండ్ల తోటలు సాగవుతున్నాయి. మిరప సుమారు 70 వేల ఎకరాల్లో, పత్తి 2.50లక్షల ఎకరాల్లో పండుతుంది. ఉద్యాన పంటల సాగులో రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానంలో కొనసాగుతోంది. కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల తోటల రైతులకు ప్రధానమైన బిందు, తుంపర్ల సేద్యం అందుబాటులో లేకపోవటం వల్ల దాని ప్రభావం వ్యవసాయ రంగంపై పడనుంది. ఈ పథకాల వల్ల గతంలో అనేకమంది సన్న, చిన్నకారు రైతులు లబ్ధి పొందారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు పూర్తి రాయితీ, బీసీ రైతులు ఐదెకరాల వరకు 90 శాతం, ఓసీ రైతులకు 80 శాతం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలు అందుకున్నారు. ఇప్పుడు నిలిపివేయటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

'తుంపర్లూ' దూరం

ప్రభుత్వం 'బిందు సేద్యం' పథకంతో పాటు పలు రకాల పంటలకు 'తుంపర్ల సేద్యం' పథకాన్ని కూడా అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా జిల్లాలో అధిక శాతం రైతులు మొక్కజొన్న, పప్పుధాన్యాల పంటలను సాగు చేశారు. ఇప్పుడు ఈ పథకాన్ని కూడా పూర్తిగా నిలిపివేయటం రైతులను తీవ్ర నిరాశపరిచింది.

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే బిందు, తుంపర్ల సేద్యం పథకాలు అమలుచేస్తాం. పెండింగ్ దరఖాస్తులకు సర్కారు నిధులు కేటాయించగానే పరికరాలు అందజేస్తాం.

అనసూయ, జిల్లా ఉద్యాన అధికారిణి

# వికసించని విజ్ఞానం.. లెక్కతప్పిన గణితం

కొత్తగూడెం : పదో తరగతి వార్షిక ఫలితాల్లో ఈ ఏడాది మంచి ర్యాంకు వస్తుందని ఆశించిన విద్యా శాఖకు నిరాశే ఎదురైంది. ఇటీవల వెల్లడైన ఫలితాలను విశ్లేషించగా.. విజ్ఞానశాస్త్రం తర్వాత గణితంలోనే ఎక్కువ మంది కనీస అర్హత మార్కులు సాధించలేదని తేలింది. మాతృభాష తెలుగులోనూ పలువురు విద్యార్థులు తడబడ్డారు. దీనికంటే హిందీలోనే ఎక్కువ ఉత్తీర్ణత శాతం నమోదవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అనుత్తీర్ణుల సంఖ్య పెరగడంతో ఖమ్మం జిల్లా రాష్ట్రస్థాయిలో 18వ స్థానానికి పరిమితమైంది.

అభ్యసనా సామర్థ్యంపై 'కొవిడ్' ప్రభావం

కొవిడ్ కారణంగా వరుసగా రెండు విద్యా సంవత్సరాలు ప్రత్యక్ష బోధన జరగలేదు. ఆ తర్వాత ప్రస్తుత ఏడాది ప్రత్యక్ష తరగతులు నిర్వహించినా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం కొందరిలో పెద్దగా మార్పు చెందలేదు. ముఖ్యంగా ఆంగ్ల మాధ్యమం వారు మాతృభాష తెలుగులోనూ అనుత్తీర్ణులయ్యారు. గణితంలో ప్రశ్నలు కొంత కఠినంగా రావడంతో అధిక శాతం తప్పారు. సైన్స్‌లోనూ రెండు పరీక్షలు నిర్వహించినప్పుడు.. ఏదో ఒక దాంట్లో మెరుగైన మార్కులు సాధించి ఉత్తీర్ణులయ్యేవారని విషయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ సారి ఆ అవకాశం లేకపోవడం ఫలితాలపై ప్రభావం చూపినట్లు చెబుతున్నారు. సాంఘిక శాస్త్రం తప్పినవారిలో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. ప్రశ్నలను సరిగా అర్థం చేసుకుని సమాధానం రాయడంలో వీరు వెనుకపడ్డారు.

సన్నద్ధతపై ప్రత్యేక దృష్టి అవసరం

సబ్జెక్టులు తప్పిన విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది.



త్వరలో జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో గణితం, సైన్స్, సోషల్‌లో అందరూ ఉత్తీర్ణత సాధించేలా కొన్ని యాజమాన్యాల పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. అన్ని మండలాల్లో తరగతులు నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వేసవి సెలవులు కావడం, ప్రభుత్వం అనుమతిస్తేనే పనిదినాలకు ఈఎల్స్(ఎర్నడ్ లీవ్స్) వచ్చే అవకాశం ఉండటంతో కొందరు ఉపాధ్యాయులు తరగతులు చెప్పడానికి ముందుకురావడం లేదనే వాదన వినిపిస్తోంది. రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేస్తే ప్రత్యేక సన్నద్ధతకు అవకాశం కలుగుతుంది.

ఉభయ జిల్లాల్లో సైన్స్, గణితం సబ్జెక్టుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరంతా ఉత్తీర్ణత సాధించడానికి అన్ని మండలాల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాం. రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన అభ్యాస దీపికలను విద్యార్థులు సాధన చేసేలా చూడాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులకు సూచిస్తాం. సోమశేఖర్‌శర్మ, డీఈఓ

# భగీరథ.. ఇంటికి చేరని కథ!

వరంగల్ : అందరికీ శుద్ధ జలాలను అందించే మిషన్ భగీరథ పథకం పనులు నర్సంపేటలో నేటికీ పూర్తి కాలేదు. ఏళ్లుగా పనులు సా..గుతుండడంతో పట్టణ వాసులకు మురికి నీరే దిక్కుగా మారింది. ఇంటింటికీ కృష్ణానది జలాల సరాఫరాకు 2018లో రూ.38.98 కోట్లు మంజూరు కాగా ఎన్‌సీసీ లిమిటెడ్ సంస్థ పనులను పొందింది. మూడేళ్లుగా పనులు నడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదు. ఎన్టీఆర్ మినీ స్టేడియం ఆవరణలో నిర్మించిన ఈఎల్‌బీఆర్ ట్యాంక్ నుంచి పాత ప్రధాన పైపులైన్‌కు నాలుగేళ్ల కిందట కనెక్షన్ ఇచ్చి మిషన్ భగీరథ నీటిని పంపిణీ చేస్తున్నా అన్ని వార్డులకు అందడం లేదు.

**పనులెప్పటికి పూర్తవుతాయో?**

గత ఏడాది ఏప్రిల్‌లో మిషన్ భగీరథ పనులు ప్రారంభించారు. ప్రధాన పైపులైన్ నిర్మాణ పనులు, వార్డుల్లో అంతర్గత పైపులైన్లకు కందకాల తవ్వకం పనులు చేపట్టారు. ప్రస్తుతమున్న ఆరు ఓవర్ ట్యాంకులకు అదనంగా మరో నాలుగు ట్యాంకులు, 4900 మీటర్ల (6కి.మీ.)ప్రధాన పైపులైన్, 147 కి.మీ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ నిర్మాణం చేసి 13756 గృహాలకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. మూడేళ్ల క్రితం సర్వాపురంలో 5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ పూర్తయింది. శాంతినగర్‌లో 8లక్షల లీటర్ల సామర్థ్యంతో కూడిన ట్యాంక్, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ఆవరణలో 10 లక్షల లీటర్ల సామర్థ్యం



గల ట్యాంక్‌ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. పుర కార్యాలయం ఆవరణలో 6 లక్షల లీటర్ల సామర్థ్యంగల ట్యాంకు నిర్మిస్తున్నారు. మొత్తం 147 కి.మీ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ నిర్మాణానికిగాను 130 కి.మీ. పనులు పూర్తి కాగా ఇంకా 17 కి.మీ చేయాల్సి ఉంది. ప్రధాన పైపులైన్ 6 కి.మీ.పనులు పూర్తయ్యాయి. జాతీయ రహదారిలో చేసే ప్రధాన పైపులైన్ పనులకు జాతీయ రహదారుల అథారిటీ అధికారులు అనుమతి ఇవ్వాల్సి ఉంది. 2021 డిసెంబరు నెలలో జరిపిన సమీక్షలో 2022 మార్చి నాటికి ప్రజలకు శుద్ధ జలాలను అందిస్తామని అధికారులు చెప్పిన గడువు దాటి 15 నెలలైనా పనులు పూర్తి కాలేదు. ఇంకెన్ని రోజులు పడుతుందో తెలియదు.

రూ.1.2 కోట్లు చెల్లిస్తేనే అనుమతి

ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి అంబేడ్కర్, జయలక్ష్మి కూడళ్ల మీదుగా పాకాల, ఖానాపురం మార్గంలో జాతీయ రహదారిలో మొత్తం 12.8 కి.మీ. నిడివితో ప్రధాన పైపులైన్ నిర్మాణం పనులకు జాతీయ రహదారుల అథారిటీ అనుమతి ఇవ్వాలి. ఎన్‌హెచ్ సంస్థకు పుర అధికారులు లేఖ రాయగా రూ.1.2 కోట్లు చెల్లించాలని, ఇందులో రూ.12లక్షలు బ్యాంక్ డిపాజిట్‌గా మిగిలిన నగదు తమ శాఖకు చెల్లించాలని చెప్పారని తెలిసింది. ఈ విషయాన్ని పుర అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

త్వరలో పూర్తి చేస్తాం

శాంతిస్వరూప్, పురపాలక ఏఈ, నర్సంపేట

మిషన్ భగీరథ పనులు సాధ్యమైనంత తొందర్లో పూర్తి చేస్తాం. ప్రస్తుతం ప్రధాన పైపులైన్ల, అంతర్గత పైపులైన్లు కలిపి 21 కి.మీ. పొడవు పనులు మిగిలి ఉన్నాయి. జాతీయ రహదారుల సంస్థకు చెల్లించాలన్న నగదుపై నిర్ణయం జరిగాక ప్రధాన పైపులైన్ నిర్మాణం పనులు చేస్తాం. ఓవర్ హెడ్ ట్యాంకుల పనులు తుది దశకు చేరాయి.

# అనుకూలంగా ఉన్న వారికే పనులు

గోదావరిఖని : భీమునిపట్నం సమీపంలో నిర్మించిన ట్యాంకునకు పైపులైను కనెక్షన్ లేక ఈ ప్రాంతంలో నీటి సరఫరా చేయలేకపోతున్నారు. అమృత్ పథకంలో రూ.1.75 కోట్లతో నిర్మించిన ట్యాంకునకు పైపులైను నిర్మించి అనుసంధానం చేస్తే ఎన్టీపీసీ ప్రాంతంలోని అన్నపూర్ణకాలనీ, కృష్ణానగర్ ప్రాంతాలకు తాగునీరు సరఫరా అవుతుంది. కాగా పైపులైను పనులు చేపట్టకపోవడంతో జ్యోతినగర్ ప్రాంతాల ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఇదీ రామగుండం నగరపాలక ప్రాంతంలో పనుల తీరు. కౌన్సిల్ ఆమోదం జరిగినా పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. అధికారులకు, కొంతమంది పాలకులకు అనుకూలంగా ఉన్న గుత్తేదారులకు పనులు కేటాయించే విధంగా నిబంధనలు సవరించి టెండర్లు ఆహ్వానిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిగతా వారికి నగరపాలక సంస్థలో టెండర్లు రావడం లేదు. నీటి సరఫరా కోసం కౌన్సిల్ ఆమోదం జరిగి ఆరునెలలైనా పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదు. రూ.మూడు కోట్లతో ఆరు పనులకు టెండర్లు ఆహ్వానించారు. రూ. 50 లక్షల చొప్పున ఆరు పనులుగా విభజించి వేసవి నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా ఆహ్వానించిన టెండర్లకు కేవలం రూ.1.5 కోట్లతో చేపట్టే మూడు పనులకు మాత్రమే గుత్తేదారులు ముందుకు వచ్చారు. వర్షాకాలం ప్రారంభం నాటికి ఈ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నా మూడు పనులు ఇంకా మొదలే కాలేదు.

యంత్రాల కొనుగోలులో...

రామగుండం నగరపాలక సంస్థలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. యంత్రాలు రాకుండానే బిల్లులు చెల్లించిన విషయం రెండేళ్ల తర్వాత వెలుగు చూసింది. రెఫ్యూజ్ కాంపాక్టర్‌తో పాటు జెట్టింగ్ కం రాడ్డింగ్, 30 ఫ్లస్‌చైన్ జేసీబీలకు రూ.1.83 కోట్ల బిల్లులు చెల్లించారు. ఓ సంస్థ మధ్యవర్తిత్వం ద్వారా ఈ యంత్రాలను కొనుగోలు చేశారు. కాని యంత్రాలు మాత్రం నగరపాలక సంస్థకు చేరలేదు. బిల్లులు చెల్లించినా యంత్రాలు కనిపించకపోవడంపై నగరపాలక సంస్థలో అప్పట్లో దుమారం రేగింది. కోట్ల రూపాయల బిల్లులు చెల్లించినా యంత్రాలు రాకపోవడానికి గల కారణాలేమిటన్న అంశాలపై విచారణ చేపట్టడంతో ఒకొక్కటిగా యంత్రాలు ప్రత్యక్షమయ్యాయి. ఇప్పటికీ ఇంకా బాబ్‌కార్ట్ యంత్రం రావాల్సి ఉంది. 2021లో వీటికి బిల్లులు చెల్లించగా విషయం వెలుగు చూడటంతో ఇప్పుడిప్పుడే ఒక్కో యంత్రం నగరపాలక సంస్థకు చేరుకుంటోంది. కమీషన్ల కోసం...కొన్ని పనులను కేవలం కమీషన్ల కోసమే చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా కాంక్రీటుపై బీటీ రోడ్డు వేస్తారు. కాగా ఇది వరకే ఉన్న సీసీ రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మించేందుకు పనులు కేటాయించారు. కేవలం కమీషన్ల కోసమే ఇటువంటి పనులు కేటాయిస్తున్నట్లు స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం అనుకూలంగా ఉన్న నిబంధనలను టెండరులో పొందుపరుస్తున్నారు. దీంతో మిగతా గుత్తేదారులకు ఆయా నిబంధనలకు అనుగుణంగా అనుభవం లేకపోవడంతో టెండరులో పాల్గొనలేకపోతున్నారు.

# నీటి కోసం పోతే నింగికేనా..?

భైంసా : వాలేగాంలో పలు బోర్లకు సింగిల్ ఫేస్ మోటార్లు అమర్చి ప్రజల దాహార్తిని తీర్చుతున్నారు. కాని అక్కడ నియంత్రణ డబ్బాలు చిన్నారులకు చేతికందే ఎత్తులో ఉన్నాయి. నిరంతరం నీరు పారుతుండటంతో చిన్నారులు ఆడుకుంటున్నారు. స్టార్టర్ డబ్బాల వద్ద తీగలు వేలాడుతున్నాయి. కుభీరు మండలం పాంగ్రా ఊరి చివర నీటి సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సింగిల్ ఫేస్ మోటారు నిరంతరం పారుతోంది. అక్కడి కాలిపోయిన చెట్టు మానుకు స్టార్టర్ డబ్బా అమర్చారు. తీగలన్నీ చిందర వందరగా ఉన్నాయి. బోరు చుట్టూ పిచ్చిగడ్డి పెరిగి అపరిశుభ్రత నెలకొంది.

కుంసర గ్రామంలో ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఈ మోటారుకు నియంత్రణే లేదు. స్టార్టర్ డబ్బా పనిచేయడం లేదు. విద్యుత్ ఉన్నప్పుడు నిరంతరం పారుతోంది. నీరు ఏకధాటిగా పారడంతో వృథా అవుతోంది. పాఠశాలకు దగ్గరగా ఉండడంతో విద్యార్థులు వస్తుంటారు. దాదాపు గ్రామస్థులంతా దీనిపైనే ఆధారపడి ఉన్నారు.



ఇంటింటికీ శుద్ధజలం పేరిట అందుబాటులోకి వచ్చిన మిషన్ భగీరథ పథకం ప్రజల అవసరాలు పూర్తిగా తీర్చడంలేదు. దీంతో గతంలో వేసిన చేతి పంపులపైనే జిల్లా పల్లె వాసులు ఆధారపడుతున్నారు. అధికారులు వాటికి సింగిల్ ఫేస్ విద్యుత్ మోటార్లను అమర్చి ప్రజల నీటి అవసరాలు తీర్చుతున్నారు. విద్యుత్ సరఫరా ఉన్నంతసేపు నీరు పారుతూనే ఉంటోంది. వాటిని నియంత్రించక పోవడంతో విద్యుత్, నీరు వృథా అయి పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ మోటార్ల నియంత్రణకు ఏర్పాటు చేసిన స్టార్టర్ డబ్బాలు ఎక్కడపడితే అక్కడ చిన్నారులకు చేతికందే ఎత్తులో ఉన్నాయి. వాటి విద్యుత్తు తీగలు అస్తవ్యస్తంగా వేలాడుతున్నాయి. వోల్టేజీలో హెచ్చు, తగ్గులతో తీగలు కాలిపోతున్నాయి. ఈ సందర్భాల్లో స్టార్టర్ డబ్బాలకు విద్యుత్ సరఫరా అయి ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. గతంలో భైంసా మండలం మాహోగాంలో ఓ వ్యక్తి మోటారు మీట నొక్కేయత్నంలో డబ్బాకు విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ప్రస్తుతం వానాకాలం కావడంతో ఈదురు గాలులు, దుమారంతో ఎక్కడ ఏం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. నాణ్యమైన డబ్బాలను అమర్చి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాల్సిన నివారించాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో భగీరథ పథకం వివరాలు
లబ్ధి పొందుతున్న ఆవాసాలు : 710 మంజూరైన పథకాలు : 435 నిర్మాణం పూర్తయినవి : 435 కనెక్షన్లు మంజూరు : 1,60,235 ఇచ్చినవి : 1,60,150

పనులు మొత్తం లీకేజీలే
డాక్టర్ దెగ్లూర్ రాజు, సర్పంచి, కత్‌గాం, భైంసా (మం)మా గ్రామంలో మిషన్ భగీరథ ఇంట్రా పైప్‌లైన్, ఇంటింటి కనెక్షన్లు నామ్‌కేవాస్తేగా చేశారు. జల భాండాగారం, పైపులు లీకేజీతో నీరు వృథా అవుతోంది. ప్రజలకు చుక్క నీరందడం లేదు. పథకం అమలవుతోందని పంచాయతీలకు నీటి సరఫరాపై వ్యయం చేయొద్దని నిబంధనలు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్షణమే సదరు గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలి.

# సాగర్ నీరు.. ఎప్పుడిచ్చేరు?

ఖమ్మం :పాలేరు జలాశయం అడుగంటుతోంది.. నాగార్జున సాగర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేయకపోవడం, పాలేరు నది పరివాహక ప్రాంతంలో సరైన వర్షాలు కురవకపోవడం ఇందుకు కారణం. జలాశయంలో నిల్వ ఉన్న నీటిని తాగునీటి అవసరాలకు వినియోగిస్తుండటంతో జలాశయానికి ఈ పరిస్థితి ఏర్పడింది.

నీటి విడుదలే శరణ్యం..
వానలు, వరదల విషయాన్ని పక్కన బెడితే.. పాలేరు సెగ్మెంట్ మిషన్ భగీరథ పథకానికి సాగర్ జలాల విడుదలే శరణ్యం. సాగర్ ఎడమ కాలువ మొదటిజోన్ పరిధిలో పనులు జరుగుతున్న దృష్ట్యా నీటి విడుదల సాధ్యం కావడంలేదని అధికారులు చెబుతుండగా, పొంచి ఉన్న తాగునీటి ఎద్దడి ప్రమాదాన్ని గుర్తించాల్సిన ఆవశ్యకత నెలకొంది.

మూడు జిల్లాలు..19.03 లక్షల మందికి ఆదరవు
పాలేరు జలాశయం ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల ప్రజలకు రక్షిత తాగునీరందే సెగ్మెంట్. ఆయా జిల్లాల్లోని 2,428 ఆవాస ప్రాంతాల్లో నివాసముంటున్న 19.03 లక్షల మందికి ప్రతీ రోజు 29.40 కోట్ల లీటర్ల నీటిని చేరవేస్తున్నారు. పాలేరు జలాశయం నుంచి ఒక ఇన్‌టేక్‌వెల్ ద్వారా జీళ్లచెర్వు నీటిశుద్ధి కేంద్రానికి, మాదిరిపురం నీటిశుద్ధి కేంద్రానికి నీటిని చేరవేస్తున్నారు. జీళ్లచెర్వు కేంద్రం ద్వారా మన జిల్లావాసులకు, మాదిరిపురం కేంద్రం ద్వారా తిరుమలాయపాలెం మండలంతోపాటు మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ, డోర్నకల్, మహబూబాబాద్ పట్టణాలతోపాటు 17 మండలాలకు తాగునీరందిస్తున్నారు. నాయకన్‌గూడెం వద్ద నిర్మించిన ఇన్‌టేక్‌వెల్ ద్వారా సూర్యాపేట పట్టణంతో పాటు తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లోని 8 మండలాలకు నీరందుతోంది.

ఖమ్మం జిల్లాలో..ఖమ్మం నగరంలోని 1.89 లక్షల జనాభాతోపాటు కూసుమంచి, గ్రామీణం, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ముదిగొండ, రఘునాథపాలెం మండలాల్లోని 359 ఆవాస ప్రాంతాల్లో 5.47 లక్షల మందికి ప్రతీరోజూ 7 కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు.

సూర్యాపేట..సూర్యాపేట పట్టణంతోపాటు సూర్యాపేట, మోతె, చివ్వెంల, ఆత్మకూరు(ఎస్), నూతన్‌కల్లు, తిరుమలగిరి, తుంగతుర్తి, మద్దిరాల మండలాల్లో 383 ఆవాస ప్రాంతాల్లోని 3.44 లక్షల జనాభాకు 5.40 కోట్ల లీటర్ల రక్షిత తాగు నీరందిస్తున్నారు.

మహబూబాబాద్..మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ పట్టణాలతోపాటు 17 మండలాల్లో 1,686 ఆవాస ప్రాంతాల్లో నివాసముంటున్న 10.12 లక్షల జనాభాకు ఈ పథకం ద్వారా 17 కోట్ల లీటర్ల రక్షిత తాగునీటిని చేరవేస్తున్నారు.

జలాశయం వివరాలు నీటిమట్టం సామర్థ్యం: 23 ప్రస్తుతం: 11.10 (అడుగుల్లో..)టీఎంసీల్లో..సామర్థ్యం: 2.50 ప్రస్తుతం: 0.915

# ఆచితూచి అడుగేస్తూ.. అడ్డంకులు అధిగమిస్తూ



నిర్మల్ : ప్రొజెక్టర్ సహాయంతో పాఠాలు బోధిస్తున్న ఈయన సారంగాపూర్ మండలం కంకట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోనె మాణిక్యం. తాను, మరో ఉద్యోగి దయాకర్ సహాయంతో దీనిని సమకూర్చారు. ఈ పరికరం ద్వారా రోజువారీ బోధన చక్కగా సాగుతుండగా.. విద్యార్థులు సైతం ఇబ్బందులు లేకుండా చదువులు కొనసాగిస్తున్నారు.విద్యార్థిని సందేహాన్ని నివృత్తి చేస్తున్న ఈ ఉపాధ్యాయుడు.. ఖానాపూర్ మండలం మస్కాపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన వారు. ఇక్కడ రెగ్యులర్ ఉపాధ్యాయులు నలుగురు ఉండగా, ఆంగ్ల మాధ్యమ బోధన నేపథ్యంలో గ్రామస్థులు మరో ముగ్గురు వీవీలను నియమించి విద్యాబోధన చేయిస్తున్నారు.విద్యార్థుల విద్యావికాసంలో భాగంగా ప్రభుత్వం ఈ ఏడాది 1-8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమ బోధన అమలుకు చర్యలు తీసుకుంది. బడులు పునఃప్రారంభమై దాదాపు 20 రోజులు అవుతోంది. ఇంగ్లీష్ మీడియం కావడంతో పిల్లలతో పాటు, ఉపాధ్యాయులు నిత్య విద్యార్థులయ్యారు. తల్లిదండ్రులు ఇళ్ల వద్ద పిల్లల విషయంలో శ్రద్ధ చూపుతున్నారు. చిన్నచిన్న పొరపాట్లను అధిగమిస్తూ ముందుకెళ్తున్నారు.

ఇబ్బందులపై దృష్టి సారిస్తేనే..ఆంగ్ల మాధ్యమ బోధన నేపథ్యంలో ఉపాధ్యాయ ఖాళీలు వేధిస్తున్నాయి. 517 చోట్ల పాఠాలు చెప్పేవారు లేరు. గతంలో విద్యావాలంటీర్లను ప్రభుత్వం నియమించినప్పటికీ కొవిడ్‌తో తొలగించారు. వారివిషయంలో ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. కొన్ని చోట్ల వీడీసీ, గ్రామస్థులే స్వచ్ఛందంగా పిల్లలకు విద్యనందిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు మొత్తం 4,09,615కు గాను ఇప్పటి వరకు 2,65,525 చేరుకున్నాయి. అధికారులు వీటిపై ప్రత్యేక దృష్టిసారిస్తే బోధన సజావుగా సాగే అవకాశం ఉంది.

ఒకటో తరగతిలో : 2,331 వివిధ తరగతుల్లో ప్రైవేటు నుంచి ప్రభుత్వ బడుల్లో: 1,135

నిత్యం పర్యవేక్షణ: ఎ.రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్
ఉపాధ్యాయులకు దశలవారీగా ముఖాముఖి, ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చి ఆంగ్లంపై పట్టు సాధించేలా, సులభమైన పద్ధతిలో విద్యాబోధన చేసేలా వారిని తీర్చిదిద్దాం. ఖాళీల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. బోధన విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.

దగ్గరుండి హొంవర్క్ చేయిస్తున్నాం : శ్రీలత, తల్లి, విట్టాపూర్
మా కుమారుడు రితీష్ ప్రస్తుతం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. ఇంగ్లీష్ మీడియం అందుబాటులోకి రావడం మేలైంది. స్కూల్ నుంచి ఇంటికి రాగానే హొం వర్క్ దగ్గరుండి చేయిస్తున్నాం. ఆంగ్ల విషయంలో శ్రద్ధ పెడుతున్నాం.

సులువుగా..: పల్లవి, విద్యార్థిని, చోండి
నేను కుభీరు మండలం చోండి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నా. ఆంగ్ల మాధ్యమం అంటే మొదట కొంత భయపడ్డాం. కానీ ఉపాధ్యాయులు బాగా వివరిస్తూ పాఠాలు చెబుతున్నారు. సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. పుస్తకాల్లో ఒక పేజీలో ఇంగ్లీష్, పక్కనే తెలుగులో ముద్రించడం ఎంతో సులువుగా ఉంది.

పట్టు సాధించేలా.. :శ్రీధర్, స్కూల్ అసిస్టెంట్, భౌతిక-రసాయన శాస్త్రం
ఆంగ్ల మాధ్యమ బోధన నేపథ్యంలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించిన పాఠ్యపుస్తకాలు ఉపయోగకరంగా ఉన్నాయి. విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం. మాకు ఇచ్చిన శిక్షణతోపాటు స్పోకెన్ ఇంగ్లీష్ క్లాసులకు వెళ్లాం. తోటి ఉపాధ్యాయులం తరచూ ఇంగ్లీష్‌లోనే సంభాషించుకుంటున్నాం.

# కళా వైభవం జలసిరుల ప్రాభవం



ఖమ్మం :కాకతీయుల కాలంలో ఆర్థిక రంగానికి ప్రధాన ఆధారం వ్యవసాయమే. వీరి కాలంలో వ్యవసాయం అంతకుముందెన్నడూ లేని విధంగా అభివృద్ధి చెందింది. కాకతీయ చక్రవర్తులు అడవులను కొట్టించి నూతన గ్రామాలను నిర్మించారు. ఎక్కడ వీలైతే అక్కడ చెరువులు తవ్వించారు.చెరువుల నిర్మాణంలో అద్భుత సాంకేతికతను వినియోగించారు. నేటికీ అవి చెక్కుచెదరలేదంటే ఎంతటి నైపుణ్యమో అర్థం చేసుకోవచ్చు. పూర్వ ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, బయ్యారం, అశ్వాపురం, కూసుమంచి, ఇల్లెందు, కామేపల్లి ప్రాంతాల్లో కాకతీయులు ఎన్నో చెరువులు, కుంటలు నిర్మించారు. వరంగల్‌లో 'కాకతీయ వైభవ సప్తాహం' నేపథ్యంలో అప్పటి పాలనా విశేషాల సమాహారంపై ప్రత్యేక కథనం. కాకతీయుల పాలనా కాలంలో చెరువు నిర్మాణానికి అద్భుత ఇంజినీరింగ్ నైపుణ్యాల్ని వినియోగించారు. తటాక నిర్మాణానికి ముందు ఆ స్థలం లోపలి పొరల్లో నీటి ప్రవాహం ఉందా లేదా, ఉంటే నీటి వాలు ఊటకు అనుకూలంగా ఉందా లేదా అని పరిశీలించారు. నీటి వాలు, నీటి పొరలను తెలిపే పరిజ్ఞానం ఆనాడు ఉన్నందున అద్భుమైన చెరువుల నిర్మాణం జరిగింది. రెండు, మూడు కొండలను ఆధారం చేసుకుని మధ్య లోతట్టు ప్రాంతంలో నీరు నిల్వ ఉండేటట్లు నిర్మించారు. ఎక్కడ నీరు కన్పిస్తే అక్కడ జలాశయాలు నిర్మించారు. ఉభయ జిల్లాల్లో నాటి జలాశయాలే నేటికీ ఆదరువుగా నిలుస్తున్నాయి.

గొలుసు కట్టుతో నీటి వృథాకు అడ్డుకట్ట
చెరువుల నిర్మాణం పుణ్యప్రదమని చాళుక్య యుగంలో ప్రజలు భావించే వారు. కాకతీయుల కాలంలో కూడా ఆ భావనతోనే ప్రజలకు మేలు చేయాలనే ఉద్దేశంతో పెద్ద ఎత్తున నిర్మాణాలకు పూనుకున్నారు. భూమి సాగులోకి వచ్చి పంటలు పండటమే కాకుండా రాజ్యానికి కూడా మంచి ఆదాయం వస్తుందని వారు భావించారు. పూర్వ ఖమ్మం జిల్లాలో కాకతీ గణపతి చెల్లెలు మైలాంబ బయ్యారం చెరువును నిర్మించి కట్టపై శాసనం వేయించారు. ఆ శాసనంలో కాకతీయ వంశవృక్షాన్ని పూర్తిగా వేయించారు. చెరువు నిండిపోయిన తర్వాత మిగతా జలాలు వృథాకాకుండా ఉండేందుకు అనుబంధంగా మరికొన్నింటిని కూడా నిర్మించారు. వీటినే గొలుసుకట్టు చెరువులుగా నేటికీ పిలుస్తున్నారు. నీటి వృథాను అరికట్టి ఎలా పొదుపు చేయాలని చెప్పిన కాకయతీయులు తరాలకు ఆదర్శంగా నిలిచారు.

రుతువులు, భూముల ఆధారంగా సాగు
కాకతీయులు వ్యవసాయాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఏయే భూముల్లో, ఏయే రుతువుల్లో ఏయే పంటలు వేయాలనే విషయంపై అవగాహన కల్పించారు. ప్రతాపరుద్రుని కాలంలో నరసింహుడు అనే పండితుడు 'నిరోష్ట్యకావ్యం' అనే సంస్కృత గ్రంథాన్ని రాశారు. నాడు వ్యవసాయం బాగా అభివృద్ధి చెంది, మంచి పంటలు పండినట్లు అందులో ప్రస్తావించారు. ఒక్కో చెరువు పరిధిలో వివిధ కులాలకు చెందిన 12మందిని 'ఆయుగాండ్రు'గా నియమించారు. వీరిలో ఒకడు 'నీరు కట్టుడు గాడు' ఉండేవారు.

భారం లేని నీటి పన్ను
చెరువుల్లో నీరు వాడుకున్నందుకు రైతులు పన్ను చెల్లించాల్సి ఉండేది. చెరువు నీరు ఇచ్చినందుకు బేతరాజు నీటి పన్నును నిర్ధరణ చేశారు. వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు కొన్ని సందర్భాల్లో పన్నులను సైతం రద్దు చేశారు. కాకతీయుల కాలంలో వ్యవసాయదారుల సంఘాలు ఉన్నట్లు శాసనాలు పేర్కొంటున్నాయి.

సాగుకు ఆదరువు సింగభూపాలం
సుజాతనగర్ మండలంలోని సింగభూపాలం చెరువును కాకతీయుల కాలంలో నిర్మించారు. దీనికి 400 ఏళ్ల చరిత్ర ఉంది. 1940 నుంచి జల వనరుల శాఖ ఆధీనంలోకి తీసుకున్నారు. 1250 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ తటాకం.. కుడి, ఎడు కాలువల ద్వారా 2,500 ఎకరాలకు రెండు పంటలకు నీరు సమృద్ధిగా అందిస్తోంది. 400 మత్స్యకార కుటుంబాలకు చేపల వేట జీవనాధారంగా మారింది. 'మిషన్ కాకతీయ' పథకంతో పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ పథకం ద్వారా 2016లో రూ.24 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులు వెచ్చించి ఆధునికీకరణ చేశారు. సుజాతనగర్, జూలూరుపాడు మండలాలకు ప్రధాన నీటి వనరుగా నిలుస్తోంది.

వెయ్యిన్నొక్క ఆలయాల్లో ఒకటి..
శిలలపై చెక్కిన శిల్పాలు.. ప్రకృతికే తెచ్చిన అందాలు.. కాకతీయుల కాలం వైభవాల ప్రాధాన్యత కూసుమంచిలో వెల్లివిరుస్తోంది.. ఓరుగల్లును ఏలిన కాకతీయ రాజుల దైవత్వానికి.. వారి కళాభిదృష్టికి.. శిల్పి నైపుణ్యతకు నిదర్శనంగా నిలుస్తున్న పురాతన శివాలయం (గణపేశ్వరాలయం) ఖమ్మం జిల్లాలో ప్రాధాన్యత సంతరించుకున్న ఆలయాల్లో ఒక్కటిగా నిలుస్తోంది. భక్తుల ఆరాధ్యదైవంగా.. పర్యాటకులకు కనువిందుచేసే పర్యాటక ప్రాంతంగా ఈ ఆలయం ప్రాధాన్యత సంతరించుకుంది.. కాకతీయుల కళా విపంచిగా ప్రసిద్ధి గాంచింది.

కూసుమంచికి ఉత్తర దిశగా, గంగాదేవిచెరువు ఒడ్డున సుమారు ఎకరం విస్తీర్ణంలో నిర్మితమైన ఈ ఆలయం కీ.శ.11-12 శతాబ్దంలో కాకతీయ రాజు గణపతిదేవుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు ప్రతీతి. వేయ్యేళ్ల క్రితం నాటి ఈ ఆలయం కాకతీయులు నిర్మించిన వెయ్యిన్నొక ఆలయాల్లో ఇదొకటి చెబుతారు. పెద్దపెద్ద బండరాళ్లను సున్నం, సిమెంటు లాంటివి వినియోగించకుండా కేవలం బండరాళ్లను ఒక్కటిపై మరొక్కటి పేర్చి ఆలయాన్ని నిర్మించారు. రాళ్లతోనే నక్షత్రాకారంలో నిర్మించిన మండపంపై దృష్టిని ఆకర్షించే శిల్పాలతో నిర్మితమైన ఆలయం ఓరుగల్లులోని వెయ్యి స్తంభాల ఆలయాన్ని పోలి ఉండటం విశేషం. గర్భగుడిలో ఆరు అడుగుల ఎత్తు, అంతే వెడల్పుతో ఏర్పాటైన శివలింగం దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద శివలింగాల్లో ఒక్కటిగా ప్రతీతి. ఇది నేటి గ్రానైట్ రాయిని పోలి ఉండటం మరో విశేషం. దివ్యాంగుడైన శిల్పి తన నైపుణ్యాన్ని రంగరించి నిర్మాణం చేపట్టాడని ప్రచారంలో ఉంది. దక్షిణ దిశగా త్రిలింగేశ్వర ఆలయం వెయ్యి స్తంభాల ఆలయాన్ని పోలి ఆకర్షణీయంగా ఉంది.

రెండు దశాబ్దాల నుంచి పూజలు
అతిపెద్ద పురాతన ఆలయం శిథిలావస్థకు చేరి భక్తుల ఆదరణకు దూరమై ఉండేది. గత 20 ఏళ్ల నుంచి భక్తజనం పూజించడాన్ని ప్రారంభించారు. పదిహేనేళ్ల క్రితం భక్తుల చొరవతో ఆలయం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది భక్తుల ఆదరణను చూరగొంటోంది. ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, వరంగల్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి భక్తులు మహాశివరాత్రి పర్వదినాన, కార్తీక మాసంలో సందర్శిస్తుంటారు.

# ఆర చేతిలో సాగు స్వరూపం

ఖమ్మం : వ్యవసాయ విస్తరణ అధికారులు(ఏఈవోలు) క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాల వివరాలను రోజువారీ నమోదు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయశాఖ ప్రత్యేకంగా 'ఏఈవో యాప్'ను రూపొందించింది. రైతువేదికలు, సంబంధిత క్లస్టర్ గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల వివరాలను ఏఈవోలు నమోదు చేస్తారు. వారు తమ చరవాణి యాప్‌లో ఎలా నమోదు చేయాలనే విషయం గురించి ఇటీవల వారికి వివరించారు.

ఏఈవోలకు 'ప్రత్యేక యాప్'
వ్యవసాయరంగాన్ని బలోపేతం చేసేందుకు గానూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి క్లస్టరుకు ఒక ఏఈవోను నియమించింది. ఆ తర్వాత ప్రతి క్లస్టరులో కూడా రూ.22లక్షలతో రైతువేదికలను నియమించింది. ఎంతో అట్టహాసంగా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి వీటిని నిర్మించినప్పటికీ అధికారులు వేదికలకు వెళ్లకుంగా ఉండటంతో చాలా వరకు నిరుపయోగంగా మారాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని నిత్యం రైతువేదికలు అధికారులు, రైతులతో కళకళలాడే విధంగా వ్యవసాయానికి సంబంధించిన కార్యక్రమాలన్నీ ఇక్కడే నిర్వహించే విధంగా ఇప్పుడు 'ఏఈవో ప్రత్యేక యాప్'ను తయారు చేసింది.

18 క్లస్టర్లలో పరిశీలన
ఈ మొబైల్ యాప్‌ను గత పది రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలు క్లస్టర్లలో ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఖమ్మం జిల్లాలోని 9, భద్రాద్రి జిల్లాలోని 9 క్లస్టర్లలో, ఆచార్య జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 10 క్లస్టర్లలో, సూర్యాపేట జిల్లాలో 8 క్లస్టర్లు, మిగతా అన్ని జిల్లాల్లో 9 క్లస్టర్ల చొప్పున పరిశీలించారు. ఈ పరిశీలన పూర్తయిన అనంతరం ఇక ఏఈవోలకు పూర్తి స్థాయిలో రైతువేదికల కేంద్రాలుగా తగిన కార్యాచరణ ప్రణాళికను తయారు చేస్తారు. వ్యవసాయశాఖ ఇచ్చిన ఈ ప్రణాళికను ఏఈవోలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంటుంది.

నమోదు చేయాల్సిన వివరాలివే..: రైతు వేదికలో రైతుల సమావేశాలు ఉత్పాదకాల పంపిణీ శిక్షణ పంట నమోదు బీమా క్లెయిమ్‌ల పరిశీలన లి రాయితీ విత్తనాల కోసం అనుమతులు మంజూరు లి ధాన్యం కొనుగోలు మట్టి నమూనాల సేకరణ పంట కోత ప్రయోగాలులి క్షేత్ర ప్రదర్శనలు రైతుబంధు పీఎం కిసాన్ రిజిస్టర్ల నమోదు గ్రామంలో రైతులతో సమావేశం.

రైతువేదికల నుంచే కార్యకలాపాలు
పంచాయతీ కార్యదర్శుల మాదిరిగానే ఏఈవోలు కూడా వారి పరిధిలోని రైతువేదిక ప్రాంగణం, క్లస్టర్‌లోని గ్రామాల్లో అడుగుపెట్టిన తర్వాత మాత్రమే బయోమెట్రిక్ ఓపెన్ అవుతుంది. వేదిక వద్ద సెల్ఫీ తీసుకుని, తర్వాత రైతువేదికను కూడా ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. అప్పుడు మాత్రమే ఏఈవో హాజరు వేసుకుని రోజువారీ కార్యక్రమాలను నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం 9-10గంటలు, మధ్యాహ్నం 2-5 గంటల వరకు రైతువేదికలో ఏఈవో అందుబాటులో ఉండాలి. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు క్షేత్ర పర్యటన ఉంటుంది. ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు రోజు వారీ కార్యక్రమ వివరాలు ఈయాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది.

క్షేత్రస్థాయి నుంచి కమిషనర్ వరకు సమాచారం
ఏఈవో నవోదు చేసిన అంశాలను రోజూ ఏవో, ఏడీఏ, డీఏవోతోపాటు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్‌కు పంపాల్సి ఉంటుంది. నమోదు చేసిన అంశాలను ఆయాశాఖల అధికారులకు అప్‌లోడ్ చేయాలి. తద్వారా క్లస్టర్ల వారీగా నిత్యం జరిగే కార్యక్రమాల వివరాలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఏఈవోల పనితీరు కూడా తెలుస్తుంది.

# భలే చిక్కొచ్చింది!

భద్రాచలం : భద్రాచలం ఐటీడీఏ పాలక మండలి సమీక్షను నూతన గిరిజన భవనంలో రేపు నిర్వహించనున్నారు. దీనికి ఐఏఎస్ అధికారి పీవోగా వ్యవహరిస్తున్నప్పటికీ కలెక్టర్ అధ్యక్షులుగా ఉండటం సహజం. ఈసారి సాంకేతికపరమైన అంశమొకటి తెరపైకి రావడంతో రెండు మూడు రోజుల నుంచి ఇదే చర్చ జోరుగా సాగుతోంది. 8వ నిర్వహించే పాలక మండలి సమీక్షకు ఎవరు అధ్యక్షత వహిస్తారన్నది ఇందుకు కారణం. సాధారణ సమావేశాలకు, కార్యకలాపాలకు ఇబ్బంది కనిపించనప్పటికీ ఈసారి ఉన్నత స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయడంతో అధ్యక్ష స్థానంపై అయోమయం నెలకొందని తెలిసింది. జిల్లాల విభజన ప్రక్రియ పూర్తయిన తర్వాత 2019 ఆగస్టు 13న సమీక్ష జరిగింది. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే ఉండడంతో ఈ జిల్లా కలెక్టర్ దీన్ని కొనసాగించారు. ఈసారి ఇదే పద్ధతిని అమలు చేస్తారా? అంటే కచ్చితమైన సమాధానం రావడం లేదు. ప్రొటోకాల్ విధులకు సంబంధించిన పుస్తకాలను జీవోలను తిరగేస్తున్నట్లు వినికిడి.నాలుగు జిల్లాల పరిధిలో మన్యంభద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాలు ఉన్నాయి. ఇందులో కొంత మైదాన ప్రాంతం ఉన్నప్పటికీ అన్ని మండలాలు ఐటీడీఏ పరిధిలోనివే. జిల్లాలు విడిపోవడంతో ఖమ్మంలో(5) ఏన్కూరు, కామేపల్లి, సింగరేణి పూర్తిగా సత్తుపల్లి, పెనుబల్లి మండలాలు పాక్షికంగా విలీనమయ్యాయి. మహబూబాబా ద్‌లో(2) బయ్యారం, గార్ల ఉన్నాయి. ములుగులో(2) వెంకటాపురం, వాజేడు మండలాలు కలిశాయి. ఇలా 32 మండలాలకు ఐటీడీఏ పాలన అందుతోంది. ఐటీడీఏకు కలెక్టర్ అధ్యక్షత వహించాలని ఉన్నప్పటికీ దీని పరిధి 4 జిల్లాల్లో ఉంటే ఏం చేయాలన్నది అంతు చిక్కడం లేదు. ఈ నలుగురిలో సీనియర్‌కు అవకాశం కల్పిస్తే తక్కువ మన్యం ఉండే జిల్లా అధికారి పాత్ర కీలకమయ్యే వీలుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనే ఐటీడీఏ ఉన్నందున ఈ జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే ఇక్కడో తిరకాసు ఉంది. ఐటీడీఏ ఏర్పడినప్పుడు ఈ జిల్లా లేదన్నది ప్రస్తావనకు వస్తుంది.

అధ్యక్షా..!రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు 6 తెలంగాణకు 3 ఐటీడీఏలు లభించాయి. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఏటూరు నాగారం, ఆదిలాబాద్‌కు ఉట్నూరు, ఖమ్మం జిల్లాకు భద్రాచలం మిగిలాయి. అప్పట్లో ఇక్కడి పాలక మండలి సమావేశాలకు ఖమ్మం కలెక్టర్ అధ్యక్షత ఉండేది. గత సమీక్షకు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ఈ బాధ్యతను నిర్వహించారు. ఈ సమీక్ష తర్వాత ఎన్నో ప్రశ్నలు తలెత్తినట్లు తెలిసింది. జిల్లాల విభజన పూర్తయినప్పటికీ ఐటీడీఏల విభజన జరగలేదు. 1975లో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఇది మంజూరైంది. ఆ తర్వాత కొంతకాలం పాల్వంచలో కొనసాగింది. 1993 నుంచి భద్రాచలంలో కార్యాలయ కార్యకలాపాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఖమ్మం కలెక్టర్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారనే చర్చ వినిపిస్తోంది. నలుగురు ఐఏఎస్ అధికారుల్లో ఎవరికి ఈ అవకాశం దక్కుతుందో తెలియాల్సి ఉంది. పరిపాలనా సౌలభ్యం కోసం ఐటీడీఏల విభజన చేయాలనే వాదనలు ఉన్నాయి. అవసరమైన చోట్ల కొనసాగించాలని కోరుతున్నారు.



# కొలువుదీరిన శివరామయ్య రాజ్యం

బెంగళూరు: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరింది. రాష్ట్ర 24వ ముఖ్యమంత్రిగా సీనియర్ నేత సిద్ధరామయ్య శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఉపముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణం చేశారు. కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్ వీరి చేత ప్రమాణం చేయించారు. బెంగళూరులోని కంఠీరవ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, విపక్ష నేతలు, పెద్ద ఎత్తున కార్యకర్తలు హాజరయ్యారు. ప్రమాణస్వీకారానికి ముందు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకున్న రాహుల్, ప్రియాంక గాంధీకి శివకుమార్ స్వయంగా సాదర స్వాగతం పలికారు. దగ్గరుండి వారిని వేదిక వద్దకు తీసుకొచ్చారు.

**మంత్రులుగా ఎనిమిది మంది..** సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మరో ఎనిమిది మంది కేబినెట్ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. మాజీ ఉపముఖ్యమంత్రి జి.పరమేశ్వర, కె.హెచ్ మునియప్ప, కె.జె. జార్జ్, ఎం.బి. పాటిల్, సతీశ్ జరి?హోళి, ప్రియాంక్ ఖర్గే, రామలింగారెడ్డి, బి.జడ్. జమీర్ అహ్మద్ ఖాన్ చేత గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్ మంత్రులుగా ప్రమాణం చేయించారు. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కుమారుడు ప్రియాంక్‌కు కేబినెట్‌లో చోటు దక్కింది. ఇక అన్ని వర్గాల వారికీ సమప్రాధాన్యం కల్పించేలా కేబినెట్‌లో మంత్రి పదవులను కేటాయించినట్లు కాంగ్రెస్ తెలిపింది.

**సీఎంలు.. మాజీ సీఎంలు :** ప్రమాణస్వీకార కార్యక్రమానికి తమిళనాడు, రాజస్థాన్, బిహార్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రులు ఎంకే స్టాలిన్, అశోక్ గెహ్లాత్, నీతీశ్ కుమార్, భూపేశ్ బఘేల్, సుఖ్వీందర్ సింగ్ సుక్కు, బిహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ, మధ్యప్రదేశ్ మాజీ సీఎం కమల్‌నాథ్, ఎన్సీపీ అధ్యక్షుడు శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా, సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం అధ్యక్షుడు కమల్ హాసన్ తదితరులు హాజరయ్యారు. ఇటీవల జరిగిన కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ 135 స్థానాలతో అఖండ విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, సీఎం ఎంపిక విషయంలో కాంగ్రెస్ పెద్ద కసరత్తే చేయాల్సి వచ్చింది. సుదీర్ఘ మంతనాల తర్వాత పార్టీ ప్రయోజనాలు, సీనియార్టీని దృష్టిలో పెట్టుకుని అధిష్ఠానం సిద్ధరామయ్య వైపు మొగ్గుచూపింది. డీకే శివకుమార్‌కు సర్దిచెప్పి ఉపముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించింది. కాగా.. సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పగ్గాలు అందుకోవడం ఇది రెండోసారి.



# ₹2వేల నోటు ఉపసంహరణ ప్రయోజనకరమే..

ఆర్థిక వ్యవస్థ నుంచి రూ.2,000 నోట్లను ఉపసంహరిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చేసిన శుక్రవారం చేసిన ఆకస్మిక ప్రకటన.. విపక్షాల విమర్శలకు దారితీసింది. ఈ నిర్ణయంతో సామాన్యులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని నిపుణులు చెబుతున్నా.. ప్రతిపక్షాలు మాత్రం కేంద్రంపై భగ్గుమంటున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై స్పందించిన ఆర్థిక శాఖ మాజీ ప్రధాన సలహాదారు కృష్ణమూర్తి సుబ్రమణియన్.. ఈ నిర్ణయం భారత ఆర్థిక వ్యవస్థకు ప్రయోజనకరమేనన్నారు. అందుకు కొన్ని అంశాలతో ఆయన వివరణ ఇచ్చారు. మరి సుబ్రమణియన్ ఏం చెప్పారంటే..? రూ.2వేల నోటు ఉపసంహరణతో నగదు నిల్వ ఉంచుకోవడం తగ్గుతుంది. రూ.3.6లక్షల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు చలామణిలో ఉన్నాయి. ఇందులో కొంతభాగం ఎక్కడుందో కూడా తెలియదు. అవన్నీ ఇప్పుడు బయటకు వస్తాయి. ఎందుకంటే.. ఈ మధ్య తరచూ దర్యాప్తు సంస్థల దాడుల్లో నోట్ల గుట్టలు బయటపడుతుండగా.. అందులో రూ.2వేల నోట్లే అధికం. దేశంలో 80శాతం మంది ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2వేల నోట్లను చట్టబద్ధంగా భద్రపర్చుకున్నారు. కానీ ఆ నోట్ల విలువ మొత్తం చలామణిలో ఉన్న రూ.2వేల నోట్ల విలువలో కేవలం 20శాతం మాత్రమే కావడం గమనార్హం. మిగతా 20శాతం మంది వద్ద ఉన్న రూ.2వేల నోట్ల గుట్టల విలువ 80శాతంగా ఉంది. ఇప్పుడు అదంతా వెలికి తీసేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. ఇక, ఈ నోటు ఉపసంహరణ కారణంగా సామాన్యులకు ఎలాంటి అసౌకర్యం ఉండదు. అందుకు ఐదు కారణాలున్నాయి..!

1. ప్రస్తుతం రూ.2వేల నోటును చెల్లింపుల కోసం ఎక్కువగా వినియోగించట్లేదు. చలామణిలో ఉన్న మొత్తం కరెన్సీ నోట్లలో ఈ నోట్ల విలువ కేవలం 10.8శాతమే. 2. ఇప్పుడు అత్యధిక లావాదేవీలు డిజిటల్ చెల్లింపుల రూపంలోనే జరుగుతున్నాయి. అందువల్ల, కరెన్సీ నోట్లు ముఖ్యంగా రూ.2వేల నోటు వినియోగం క్రమక్రమంగా మరింత తగ్గిపోతుంది. 3. రూ.2వేల నోటుకు ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేందుకు మరో పెద్ద నోటు రూ.500 నోటు ఉంది. నగదు మార్పిడి కోసం ఈ నోట్లను వాడుకోవచ్చు. 4. 2026 నాటికి డిజిటల్ లావాదేవీలు మూడు రెట్లు పెరుగుతాయని నివేదికలు చెబుతున్నాయి. అందువల్ల రాబోయే ఏళ్లలో రూ.2వేల నోటు వినియోగం అవసరం ఉండకపోవచ్చు. 5. ఇక, అత్యంత ముఖ్యమైన విషయం ఏంటంటే.. రూ.2వేల నోటు చెల్లుబాటు (లీగల్ టెండర్) కొనసాగుతుందని ఆర్‌బీఐ చెప్పింది. సెప్టెంబరు 30 తర్వాత కూడా ఇది చెల్లుబాటు అవుతుందా లేదా అనే దానిపై ఆర్‌బీఐ మళ్లీ స్పష్టతనిస్తుంది. అప్పటివరకు చట్టపరంగా భద్రపర్చుకున్న వారు తమ రూ.2వేల నోట్లను మార్చుకునేందుకు ఏ సమస్యా ఉండదు. ఎలా చూసినా ఈ నిర్ణయం సరైందే..! అని కృష్ణమూర్తి సుబ్రమణియన్ తన ట్విటర్ ఖాతాలో వివరించారు.

# రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం!



అమరావతి : అపీపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. జూన్ 1 నుంచి ఈ మేరకు రాష్ట్రంలో ఆస్తిని కొన్న ప్రాంతంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన అవసరం లేదు. ఒక ప్రాంతంలో కొన్న ఆస్తికి మరో ప్రాంతంలోనైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ను ప్రవేశపెడుతోంది. ఇందులో భాగంగా ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద వచ్చిన దస్తావేజులను సదరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆ ఆస్తి ఉన్న ప్రాంతానికి చెందిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపించాల్సిన అవసరం లేదు. ఆన్లైన్ లో రికార్డు అయి ఉన్న ఆ ఆస్తికి సమాచారాన్ని నిర్ధారించుకుని రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఉదాహరణకు విజయవాడ నగర పరిధిలో ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ ను విశాఖపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చేయించుకోవచ్చు. అందుకు సంబంధించిన దస్తావేజును ఆన్లైన్ మాడ్యూల్ లో పెండింగ్ రిజిస్ట్రేషన్ జాబితాలో చేరుస్తారు. అనంతరం సిబ్బంది విశాఖ నగరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఆస్తి తాలూకు దస్తావేజులను ఆన్లైనులో పంపుతారు. అక్కడి సబ్ రిజిస్ట్రార్ ఎటువంటి ఇబ్బందులు లేవని నిర్ధారణకు వచ్చిన అనంతరమే సదరు దస్తావేజుకు గ్రాంట్ అప్రూవల్ ఇస్తారు. దీనిలో భాగంగా విశాఖపట్నంలోని సదరు సబ్ రిజిస్ట్రార్ ఆ ఆస్తికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఒకవేళ సబ్ రిజిస్ట్రార్ తిరస్కరిస్తే.. పునఃపరిశీలిస్తారు. ఆస్తి ఉన్న ప్రాంత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్ణయం సానుకూలంగా రాకుంటే.. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ జరగదు. కాగా ఈ విధానం అమల్లో కొత్త సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. కొన్నిచోట్ల భారీ ఎత్తున అవినీతి కూడా జరుగుతోందని చెబుతున్నారు. ఒక సబ్‌రిజిస్ట్రార్ ఓకే అంటే.. మరో సబ్ రిజిస్ట్రార్ అంగీకరించడం లేదని సమాచారం. ఈ నేపథ్యంలో అమల్లోకి తేనున్న ఈ కొత్త ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ను పురస్కరించుకొని మే 27లోగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కోర్టు అటాచ్మెంట్ ఉత్తర్వులు షిద్ధ జాబితాలు సరిచూడాలని స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఆదేశాలు జారీ చేసింది. మార్పులు ఉంటే ఆన్లైన్లో నమోదు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.



# వెలిగండ్ల మహిళ హత్య కేసులో వీడని మిస్టరీ

**ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలంలో జరిగిన మహిళ హత్య కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. రాధను హత్య చేయడానికి ఆర్థిక కారణాలా? లేదా ఇతర అంశాలేమైనా ముడిపడి ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు కూపీ లాగుతున్నారు. ఆమెను హత్య చేసిందెవరు? చేయించింది ఎవరు? అనేది తేల్చేందుకు దర్యాప్తు సాగుతోంది.**



# మరోసారి సీబీఐ నోటీసులు

# అవినాష్‌రెడ్డికి మరోసారి సీబీఐ నోటీసులు

హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి సీబీఐ మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈనెల 22న ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ మేరకు వాట్సాప్ ద్వారా సీబీఐ అధికారులు అవినాష్‌రెడ్డికి నోటీసులు పంపారు. ఇప్పటికే రెండుసార్లు సీబీఐ విచారణకు అవినాష్ రెడ్డి గైర్హాజరయ్యారు. వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్ రెడ్డి శుక్రవారం సీబీఐ ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉంది. నిన్న రోజంతా నెలకొన్న నాటకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన విచాణరకు హాజరుకాలేదు. చివరి నిముషంలో తన తల్లి శ్రీలక్ష్మి (లక్ష్మమ్మ) ఆరోగ్యం బాగాలేదంటూ పులివెందుల వెళ్లిపోవడం, సీబీఐ అధికారులు ఆయనను కొంతదూరం అనుసరించడం వంటి పరిణామాలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఈలోపు అవినాష్ న్యాయవాదులు సీబీఐ కార్యాలయానికి చేరుకొని ఈ విషయం చెప్పి, విచారణకు హాజరయ్యేందుకు మరో తేదీ ఇవ్వాలని కోరారు. అవినాష్ అరెస్టు తప్పదని భావిస్తున్న తరుణంలో చివరి నిముషంలో చోటుచేసుకున్న ఈ నాటకీయ పరిణామాలు రాష్ట్రంలో తీవ్ర ఉత్కంఠ రేపాయి. ప్రార్థన చేస్తున్న సమయంలో ఆయన తల్లి లక్ష్మమ్మకు గుండెపోటు వచ్చిందంటూ శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఆమెను కుటుంబీకులు పులివెందులలోని ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రిలో చేర్పించారు. అదే సమయానికి అవినాష్‌రెడ్డి హైదరాబాద్‌లోని సీబీఐ కార్యాలయంలో విచారణకు హాజరుకావాల్సి ఉంది. తన తల్లి అనారోగ్యం పాలైనందున విచారణకు హాజరుకాలేనంటూ ఆయన సీబీఐకి న్యాయవాది ద్వారా సమాచారం పంపించి.. హైదరాబాద్ నుంచి పులివెందులకు బయల్దేరారు. సీబీఐ అధికారులు ఆయన వాహనశ్రేణిని అనుసరించడంతో అవినాష్‌రెడ్డిని అరెస్టు చేసేందుకే వెంబడిస్తున్నారని ప్రచారం జరిగింది. అవినాష్‌ను అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకెళ్తే సీబీఐను అడ్డుకోవాలనే వ్యూహంలో భాగంగానే ఎక్కడికక్కడ వైకాపా శ్రేణులను మోహరించారన్న ప్రచారం జరిగింది. దీంతో కొన్ని గంటలపాటు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సాయంత్రం 4.45 గంటల సమయంలో అవినాష్ తల్లి లక్ష్మమ్మను కర్నూలులోని డాక్టర్ కాంతారెడ్డికి చెందిన విశ్వభారతి ఆసుపత్రిలో చేర్పించటంతో నాటకీయ పరిణామాలకు తెరపడింది. ప్రస్తుతం శ్రీలక్ష్మమ్మకు విశ్వభారతి ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. అవినాష్‌రెడ్డి కూడా తల్లితో అక్కడే ఉన్నారు. తాజాగా సీబీఐ మరోసారి నోటీసులు జారీ చేయడంతో ఉత్కంఠ మళ్లీ మొదలైంది. నోటీసులపై అవినాష్ ఎలా ముందుకెళ్తారనే విషయం ఆసక్తికరంగా మారింది.



# నేను ప్రతీకారం మొదలెడితే ఊహకు కూడా అందదు!

నెల్లూరు: నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ అనుచరుడు, వైకాపా విద్యార్థి నేత హాజీపై శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ప్రస్తుతం హాజీ నెల్లూరులోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హాజీని ఇవాళ రూప్‌కుమార్ యాదవ్ పరామర్శించారు. తన అనుచరుడిపై జరిగిన దాడిపై రూప్ కుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. "వైకాపా ఆవిర్భావం నుంచి హాజీ పార్టీలో ఉన్నారు. హాజీపై కత్తులతో హత్యాయత్నం చేశారు. కేవలం నాతో ఉన్నాడనే కక్షతోనే దాడి జరిగింది. బాధితుడు చెబుతున్నట్టు ఈ దాడి వెనుక స్థానిక ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ ఉన్నారు. ఇలాంటి దాడులు చేయడం మంచిది కాదు. గతంలోనూ నా అనుచరులపై దాడులు చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకొని ఉంటే ఇవాళ మరోసారి దాడి జరిగి ఉండేది కాదు. ఇకపై మా కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు. నేను ప్రతీకారం మొదలుపెడితే ఊహకు కూడా అందదు. ఈ ఘటనను సీఎం జగన్, పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తా. నెల్లూరులో వైకాపాను సర్వనాశనం చేస్తున్నారు" అని రూప్‌కుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ తీరుపై ఆయన బాబాయ్ (డిప్యూటీ మేయర్) రూప్ కుమార్ యాదవ్ పద్యం రూపంలో విమర్శలు గుప్పించారు. వేమన పద్యాన్ని ఉదహరిస్తూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**"అల్పబుద్ధివానికధికారమిచ్చిన.. దొడ్డవారినెల్ల తొలగగొట్టు.. చెప్పుదినెడు కుక్క చెరకు తీపెరుగునా.. విశ్వదాభిరామ! వినుర వేమ!!"... అని ధ్వజమెత్తారు.**



# ఆ నిందలు నేనే మోస్తున్నా... లీక్‌లు ఇవ్వడానికి 5 నిమిషాలు చాలు!

## ఇంటర్నేషనల్ నోటీసులున్నాయి.. లీక్ ఇవ్వడానికి 5 నిమిషాలు చాలు!: ఎమ్మెల్యే అనిల్

రూప్ కుమార్ విమర్శలపై ఎమ్మెల్యే అనిల్ కుమార్ స్పందించారు. బాబాయ్ రూప్ కుమార్‌కు అనిల్ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. వైకాపా నేత హాజీపై జరిగిన దాడికి తనకు ఎలాంటి సంబంధం లేదని అనిల్ తెలిపారు. నెల్లూరులో ఏం జరిగినా.. దానికి కారణం అనిల్ అంటూ తనపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు.

# విస్సన్నపేట భూములపై చంద్రబాబుకు గుడివాడ అమర్నాథ్ సవాల్...



విశాఖపట్నం: విస్సన్నపేట గ్రామంలో 609 ఎకరాల భూమిని కాజేసినట్టుగా చంద్రబాబు చేసిన విమర్శలపై మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పందించారు. 609 ఎకరాల్లో ఒక సెంటు భూమి అమర్నాథ్ పేరు కాని, తన కుటుంబ సభ్యుల పేరిట భూమి ఉన్నా... రాజకియాలు నుండి తప్పుకుంటానని సవాల్ విసిరారు. తాము తప్పు చేయాల్సి వస్తే రోడ్డుమీద ఉరి వేసుకుంటాం.. లేకపోతే పీక తీసి పక్కన పెట్టుకుంటామంటూ వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు నిరూపించకపోతే లోకేష్‌ను రాజకీయాలు నుండి తప్పిస్తావా అంటూ సవాల్ విసిరారు. "మీరు చెప్పిన మాటలు ప్రజలు నమ్మరు. నీ కొడుకులాగా సందులో నుంచి రాజకీయాల్లోకి రాలేదు" అంటూ విమర్శలు గుప్పించారు. రాష్ట్ర వ్యాప్తంగా షుగర్ ఫ్యాక్టరీలను మూయించింది ఎవరని ప్రశ్నించారు. షుగర్ ఫ్యాక్టరీలు గురించి మాట్లాడే హక్కు చంద్రబాబుకు లేదని మంత్రి తెలిపారు. చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలపై కోపం ఉందన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం మంచి జరగకూడదని చంద్రబాబు ఆలోచనలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రం బ్రాండ్ ఇమేజ్ దెబ్బతీసేలా చంద్రబాబు మాట్లాడుతున్నారన్నారు. విశాఖపట్నంపై చంద్రబాబు ఎందుకు విషం చిమ్ముతున్నారని ప్రశ్నించారు. ఉత్తరాంధ్ర ప్రజలు త్యాగాలు చేస్తే.. చంద్రబాబు భోగాలు అనుభవిస్తారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ 90 శాతం విజయం సాధించిందన్నారు. ఎన్టీరామారావు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని... చంద్రబాబుది వెన్నుపోటు రాజకీయం చేశారని అన్నారు. ఎన్టీరామారావు శతజయంతి ఉత్సవాలు పేరుతో మరో కొత్తడ్రామాకు తెరతీశారని అన్నారు. చంద్రబాబు అధికారం కోల్పోయిన తర్వాత ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారని మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# జులై, ఆగస్టు కోటా ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు 24న విడుదల: తితిదే



తిరుమల: జులై, ఆగస్టు నెలలకు సంబంధించి రూ.300ల శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లను ఈనెల 24న విడుదల చేయనున్నట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది.

బుధవారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్ అందుబాటులో ఉంచుతామని వెల్లడించింది. భక్తులు ఈ విషయాన్ని గమనించి తితిదే వెబ్‌సైట్ https://tirupatibalaji.ap.gov.inలో దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు తెలిపారు.




## అందాలతో అబ్బా అనిపిస్తున్న రెబ్బా..!

ఈశా రెబ్బా... అందానికి అందం అభినయానికి అభినయం. ఆమె ఏం చేసిన అంతా ఆహా ఓహో అనాల్సిందే. ఆమె అందాలను చూస్తే కూడా పొగడ్తలతో ముంచెత్తకుండా ఉండలేరు. లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ చిత్రంలో చిన్న క్యారెక్టర్ చేసినప్పటికీ... అంతకు ముందు ఆ తర్వాత చిత్రంతో హీరోయిన్ గా సినీ రంగంలో అడుగు పెట్టింది. ఆ తర్వాత చాలానే చిత్రాల్లో నటించి మెప్పించింది. కేవలం సినిమాల ద్వారానే కాకుండా.. సోషల్ మీడియా ద్వారా కూడా ఈ అందాల ముద్దుగుమ్మ అందాలు ఆరబోస్తుంటుంది. కేవలం ఫొటో లే కాకుండా తన పర్సనల్ లైఫ్ ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించిన విషయాలను అభిమానులతో పంచుకుంటుంది. ముఖ్యంగా తన సినీ అప్ డేట్లను ఎప్పటికప్పుడు అందిస్తుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇన్ స్టా వేధికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. బ్లాక్ కలర్ స్పోర్ట్స్



వేర్ వేసుకొని రచ్చ చేసింది. అందులో ఎద అందాలతో పాటు నడుము బాడీ షేపులన్నీ కనిపిస్తున్నాయి. కేవలం పైన బ్రా మాత్రమే వేసుకొని ఓ కోట్ కూడా తొడుక్కుంది. కానీ దాన్ని భుజాల పై వేసుకోకుండా.. చేతులకు మాత్రమే తగిలించుకుంది. బాడీ షేపులన్నీ పర్ ఫెక్ట్ గా కనిపించే ఈ డ్రెస్సులో ఈశా చాలా అందంగా కనిపిస్తోంది. ఈ ఫొటోలు చూసిన ప్రతీ ఒక్కరూ తెగ కామెంట్లు చేస్తున్నారు. నీ అందాన్ని తట్టుకోలేక పోతున్నామని... ఎల్లోరా శిల్పంలా ఏమి షేపులు ఉన్నాయంటూ నెటిజెన్లు కామెంట్లు చేస్తున్నారు. అందాల ఆరబోతలో ఆ అమ్మడును మించిన వాళ్లు లేరంటే అతిశయోక్తి కాదేమో అని మరికొంత మంది అంటున్నారు. ఈశా రెబ్బా ఈ ఫొటోలు షేర్ చేసిన గంటలోపే 50 వేలకు పైగా లైకులు వచ్చాయి. అలాగే 500 వరకూ కామెంట్లు వచ్చాయి. ఒక్క ఇన్ స్టా వేధికగానే 2.3 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. ఇప్పటి వరకు ఈ అందాల ముద్దుగుమ్మ 825 పోస్టులను షేర్ చేసింది. అందాలు ఆరబోస్తూ ఎప్పుడూ నెట్టింటిని షేక్ చేయడంలో ఈ ముద్దుగుమ్మ ముందుంటుంది.

## థైస్ అందాలతో పిచ్చెక్కిస్తున్న దివి పాప

తెలుగు బిగ్ బాస్ తో మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ దివి. తెలుగు లో ఈ అమ్మడు బిగ్ బాస్ కు ముందు వరకు పెద్దగా గుర్తింపు లేని నటి. కాని బిగ్ బాస్ తర్వాత అనూహ్యంగా ఈ అమ్మడికి హీరోయిన్ గా కూడా ఆఫర్లు వస్తున్నాయి. బిగ్ బాస్ ఫైనల్ ఎపిసోడ్ సందర్భంగా చిరంజీవి స్పందిస్తూ నా సినిమాలో ఆఫర్ ఇస్తాను అంటూ ప్రకటించి అందరి దృష్టిని ఆకర్షించిన విషయం తెల్సిందే. అప్పటి నుండి కూడా బిగ్ బాస్ తెచ్చి పెట్టిన క్రేజ్ తో సినిమాలు వెబ్ సిరీస్ లు అంటూ బిజీ బిజీగా ఉంది. హీరోయిన్ గా బిగ్ బాస్ ఇమేజ్ ను బాగానే క్యాష్ చేసుకుంటున్న దివి మరో వైపు



సోషల్ మీడియాలో కుమ్మేస్తుంది. హీరోయిన్ గా వస్తున్న ఇమేజ్ కంటే కూడా సోషల్ మీడియాలో హాట్ ఫోటో లు షేర్ చేయడం ద్వారా ఈ అమ్మడికి ఎక్కువగా గుర్తింపు వస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. తాజాగా ఇలా స్విమ్మింగ్ పూల్ లో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. స్విమ్మింగ్ పూల్ వద్ద థైస్ బ్యూటీని ఎక్స్ పోజ్ చేస్తూ ప్రతి ఒక్కరిని కూడా ఆకట్టుకునే విధంగా నవ్వులు చిందిస్తూ ఉంది. చూడగానే వావ్ అనిపించేంత అందంగా ఉన్న ఈ అమ్మడి ఫోటోలు మరోసారి వైరల్ అవుతున్నాయి. దివి అంటే రోజు రోజుకు అభిమానం పెరుగుతుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఈమె సినిమాల విషయానికి వస్తే చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వంలో రూపొందుతున్న భోళా శంకర్ సినిమాలో పోలీస్ పాత్రలో కనిపించబోతుందట. సినిమా లోని ఆ పాత్ర చిన్నదే అయినా కూడా తప్పకుండా ప్రతి ఒక్కరిని ఆకట్టుకునే విధంగా ఉంటుందనే నమ్మకంతో ప్రతి ఒక్కరు ఉన్నారు. ఆ సినిమా తర్వాత తప్పకుండా దివి వరుసగా ఆఫర్లు దక్కించుకుంటుందనే నమ్మకంను అభిమానులు వ్యక్తం చేస్తున్నారు. తెలుగు బిగ్ బాస్ తో మంచి స్టార్ డమ్ తెచ్చుకున్న వారు కొద్ది మంది మాత్రమే ఉన్నారు.

అందులో దివి కూడా ఒకరు. ట్రోఫీ దక్కించుకున్న వారు కూడా ఖాళీగా కూర్చుకుంటే దివి మాత్రం తన అందాలతో సోషల్ మీడియా ద్వారా అభిమానులను మరియు ప్రేక్షకులను పిచ్చెక్కిస్తోంది.

## మల్లా మూవ్స్ కి మైకం కమ్మాలి




వయసుతో సంబంధం లేకుండా అందం యవ్వనకాంతితో మెరిపించడం మలైకాకే చెల్లింది. తనకంటే సగం వయసు ఉన్న యువ హీరోతో ప్రేమాయణం సాగిస్తూ నిరంతరం మీడియా హెడ్ లైన్స్ లో నిలుస్తోంది ఈ 49ఏళ్ల బ్యూటీ. అర్థ సెంచరీకి కొద్దిరోజులే ఉన్నా మల్లా(మలైకా) అందచందాలు ఇప్పటికీ మతి చెడగొడుతున్నాయి. దీనికోసం యోగా ఫిట్ నెస్ అంటూ మలైకా చాలా సమయం కేటాయించి శ్రమిస్తుంది. 50 కి చేరువవుతున్నా మలైకా అరోరా అందం పెరుగుతోందే కానీ తరగడం లేదు. కుర్రకారు కంటికి కునుకుపట్టనివ్వని సొంపులను ప్రదర్శిస్తూ చర్చగా మారుతోంది. తాజాగా గురు రంధవా పాడిన తేరా కి ఖయాల్‌లో మల్లా అందచందాలు మతులు చెడగొట్టాయి. మలైకా ఎనిమిది అంకె స్టెప్ తో కిల్లర్ మూవ్స్ తో మైండ్ బ్లాక్ చేస్తోంది. పాట ఆద్యంతం మలైకా అందాల ఎలివేషన్ .. మెరుపులు మెరిపించే నృత్యంపైనే కెమెరా ఫోకస్ చేయగా గురు రంధవా ఎనర్జిటిక్ గానం అలరించింది. అయితే ముఖంలో కనీసం ఒక శాతం అయినా ఎక్స్ ప్రెషన్ ఇవ్వలేని గాయకుడు గురు రంధవా మలైకాతో ఇలాంటి ప్రయత్నం చేయడం అది ఆమెకు ప్లస్. ఈ పాటకు సంజోయ్ స్వరాల్ని అందించారు. 24 గంటల్లో ఈ పాటకు 10లక్షల వ్యూస్ దక్కాయి. మూవింగ్ ఇన్ మలైకా రెండు ఎపిసోడ్ లు పూర్తయ్యాక షోకి హుషారు తగ్గడంతో వీక్షకాదరణ పడిపోయింది. ఇంతలోనే ఇలా గురు రంధవాతో స్పెషల్ నంబర్ ని ప్లాన్ చేసిన మలైకా తిరిగి యూత్ లో వేడి పెంచే ప్రయత్నం చేసింది. మరోవైపు డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా మలైకా క్రేజ్ ఏమాత్రం తగ్గడం లేదు.

## కొత్త రికార్డులను సెట్ చేసిన మెగా మూవీలు ఇవే!



తెలుగు తెరపైకి చాలామంది హీరోలు వస్తుంటారు .. వెళుతుంటారు. ఎవరి ప్రత్యేకత వారిది .. ఎవరి స్టైల్ వారిది. అయితే చిరంజీవి విషయానికి వస్తే మాత్రం మరింత ప్రత్యేకంగా చెప్పుకోవలసిందే. ఎందుకంటే తెలుగు తెరపై చిరంజీవి చూపించిన స్పీడ్ వేరు. అప్పటివరకూ నడుస్తూ వచ్చిన ట్రెండును ఆయన ఒక్కసారిగా పరుగులు తీయించారు. డాన్సులలోను .. ఫైట్లలోను కొత్తదనాన్ని తీసుకుని వచ్చారు. ముఖ్యంగా తనదైన స్టైల్ తో కట్టిపడేసారు. మాస్ హీరోయిజం ఎలా ఉంటుందనేది ఆయన రుచి చూపించారు. ప్రతి హీరోకి కెరియర్ ఆరంభంలో ఒక చెప్పుకోదగిన సినిమా ఉంటుంది. అలా చూసుకుంటే చిరంజీవి కెరియర్లో 'ఖైదీ' కనిపిస్తుంది. చిరంజీవిని యాక్షన్ హీరోగా ఆవిష్కరించిన సినిమా ఇది. 1983లో కోదండరామిరెడ్డి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా 3.75 కోట్ల షేర్ ను సాధించింది. రావు గోవుపాలరావు విలనిజం .. చక్రవర్తి సంగీతం ఈ సినిమాను మరోస్థాయికి తీసుకుని వెళ్లాయి. ఇక 1987లో వచ్చిన 'పసివాడి ప్రాణం' మరోసారి చిరంజీవి గ్రాఫ్ ను పైకి లేపింది. గీతా ఆర్ట్స్ బ్యానర్ పై నిర్మితమైన ఈ సినిమా 4.75 కోట్ల షేర్ ను రాబట్టింది.

1988లో వచ్చిన 'యముడికి మొగుడు' సినిమాతో ఆయన 5 కోట్ల షేర్ మార్కును అందుకున్నారు. చిరంజీవికి మాస్ ఆడియన్స్ నుంచి మరిన్ని మార్కులు తెచ్చిపెట్టిన సినిమాల్లో 'అత్తకు యముడు అమ్మాయికి మొగుడు' ఒకటి. 1989లో వచ్చిన ఈ సినిమా కూడా చిరంజీవి ఇచ్చిన ఇండస్ట్రీ హిట్ లలో ఒకటిగా కనిపిస్తుంది. ఈ సినిమా 5.25 కోట్ల షేరును తెచ్చిపెట్టింది. ఆ తరువాత చెప్పుకోవలసిన సినిమా 'జగదేక వీరుడు అతిలోక సుందరి'. ఈ సినిమా చిరంజీవి సక్సెస్ గ్రాఫ్ ను ఎక్కడికో తీసుకునిపోయింది. 1990లోనే 6 కోట్ల షేర్ మార్కును సాధించి చిరంజీవి రేంజ్ ను ఈ సినిమా చాటిచెప్పింది. ఇక ఆ తరువాత వచ్చిన 'గ్యాంగ్ లీడర్' సినిమా సృష్టించిన సంచలనం అంత ఇంతా కాదు. 'గ్యాంగ్ లీడర్' సినిమా 1991లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. విజయబాపినీడు దర్శకత్వం వహించిన ఈ సినిమా కథాకథనాల పరంగానే కాకుండా మ్యూజికల్ హిట్ గా కూడా నిలిచింది. 7 కోట్ల షేర్ ను రాబట్టింది. 1992లో వచ్చిన 'ఘరానా మొగుడు' 10 కోట్లషేర్ ను నమోదు చేసి ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్య పరిచింది. కీరవాణి సంగీతం ఈ సినిమాను నెక్ట్స్ లెవెల్ కి తీసుకుని వెళ్లింది. ఇక బి. గోపాల్ దర్శకత్వం వహించిన 'ఇంద్ర' సినిమా 29 కోట్ల షేర్ ను వసూలు చేసి కొత్త రికార్డులను నమోదు చేసింది. అలుపనేది లేకుండా ఇంకా ఇండస్ట్రీ హిట్ లను ఇచ్చే ఉద్దేశంతోనే చిరూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తుండటం విశేషం.

## కొత్త సినిమాలో రష్మిక ఇలా ఉండబోతుందట

నేషనల్ క్రష్ రష్మిక మందన్న పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా తాజాగా రష్మిక కమిట్ అయిన కొత్త సినిమా కు సంబంధించిన లుక్ ను రివీల్ చేయడం జరిగింది. వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ హీరోగా రూపొందబోతున్న ఈ సినిమా షూటింగ్ కార్యక్రమాలు త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. ఇటీవల నితిన్ పుట్టిన రోజు సందర్భంగా ఒక పోస్టర్ విడుదల చేశారు. ఇప్పుడు రష్మిక పుట్టిన రోజు సందర్భంగా పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. చేతులు కట్టుకుని ఉన్న రష్మిక మందన్న ఫొటోను ఇక్కడ చూడవచ్చు. ఇందులో రష్మిక ఎన్నారై అమ్మాయిగా కనిపించబోతుంది. యూరప్ బ్యాక్ డ్రాప్ తో రూపొందబోతున్న ఈ సినిమా కు




సంబంధించిన రష్మిక పోస్టర్ ఆసక్తిని రేకెత్తిస్తోంది. స్టైలిష్ లుక్ లో రష్మిక ఈ సినిమా ద్వారా మెప్పించబోతున్నట్లుగా అభిమానులు మరియు ఇండస్ట్రీ వర్గాల వారు భావిస్తున్నారు. రష్మిక వరుస సినిమాలకు కమిట్ అవుతున్నా కూడా హిట్ కాంబో అయిన ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. మరో వైపు పుష్ప 2 సినిమా లో రష్మిక మందన్న నటిస్తున్న విషయం తెల్సిందే.

ఇవే కాకుండా మరో రెండు తెలుగు సినిమాలు చేస్తున్న రష్మిక మందన్నా ఇతర భాషల్లో కూడా ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తోంది. హిందీలో ఈమె చేసిన సినిమాలు నిరాశపరచడంతో కొత్తగా ఆఫర్లు ఇంకా రాలేదు. హిందీలో త్వరలోనే మరో సినిమాకు రష్మిక కమిట్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతానికి అందుకు సంబంధించిన చర్చలు జరుపుతున్నట్లుగా సమాచారం అందుతోంది. మొత్తానికి రష్మిక సౌత్ మరియు నార్త్ లో బిజీ బిజీగా ఉంది. పుష్ప 2 సినిమా హిట్ అయితే మళ్లీ రష్మిక క్రేజ్ భారీగా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. నేడు రష్మిక పుట్టిన రోజు సందర్భంగా ఆమెకు ఫ్యాన్స్ తరఫున మా తరపున హృదయ పూర్వక పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం.

## జలకాలాటలలో ఏమి హాయిలే హలా..!

జలకాలాటలలో గల గల పాటలలో .. ఏమి హాయిలే హలా అహ ఏమి హాయిలే హలా...ఏమి హాయిలే హలా అహ ఏమి హాయిలే హలా..ఉన్నది పగలైనా అహ వెన్నలెకురిసేనె.. ఉన్నది పగలైనా అహ వెన్నలెకురిసేనె... అహ వన్నె చిన్నెల కన్నె మనసులు కన్న వలపు విరిసే అహ వన్నె చిన్నెల కన్నె మనసులు కన్న వలపు విరిసే. జలకాలాటలలో గల గల పాటలలో ..ఏమి హాయిలే హలా అహ ఏమి హాయిలే హలా..ఏమి హాయిలే హలా అహ ఏమి హాయిలే హలా..తీయని రాగమెదో మది హాయిగ పాడెనె తీయని రాగమెదో మది హాయిగ పాడెనె .. తరుణ కాలమెలే అది వరుని కొరకు పిలుపే ..తరుణ కాలమెలే అది వరుని కొరకు పిలుపే .. అది వరుని కొరకు



పిలిపే. జలకాలాటలలో గల గల పాటలలో... ఏమి హాయిలే హలా అహ ఏమి హాయిలే హలా...ఏమి హాయిలే హలా అహ ఏమి హాయిలే హలా గాయకులు పి.లీల- పి.సుశీల బృందం ఆలపించిన ఈ పాటకు క్లాసిక్ నాయికల నర్తనలు మర్చిపోలేనివి. ఇప్పుడు ఈ సన్నివేశం చూస్తుంటే జాన్వీ తిరిగి పాత రోజుల్ని గుర్తుకు తెస్తోంది. నిజానికి జలకాలాటల సాంగ్స్ ని తెరకెక్కించే జోరు ఇటీవల సినిమాల్లో పెద్దంతగా కనిపించడం లేదు. ఇంతకుముందు బాహుబలి లో అవంతికతో ప్రభాస్ రొమాన్స్ ని కాస్త జలపాతాల నడుమ తెరకెక్కించారు రాజమౌళి. కానీ ఆయనే దిగొచ్చి ఇప్పుడు జాన్వీని కూడా జలకాలాటల్లో చూపిస్తారేమో చూడాలి. అన్నట్టు తనవద్ద ఓ రెండు లేడీ ఓరియెంటెడ్ స్క్రిప్టులు ఉన్నాయని రాజమౌళి అన్నారు. ఆయనకు జాన్వీ పేరును సజెస్ట్ చేస్తే తప్పేమీ కాదేమో. ఇటీవల లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తూ సత్తా చాటుతోంది ఈ నటవారసురాలు. పైనుంచి అతిలోక సుందరి శ్రీదేవి దీవెనలు అందుకుంటోంది. కాస్త జక్కన్న అటువైపు ఓ కన్నేస్తాడేమో చూడాలి. అన్నట్టు బాహుబలిలో శివగామి పాత్రను ఆఫర్ చేస్తే కాదన్న శ్రీదేవి కూతురికి జక్కన్న అవకాశమిస్తాడంటారా?





# మహారాష్ట్రలో బోణీ కొట్టిన కేసీఆర్.. వార్డు ఉప ఎన్నికలో విజయం

మహారాష్ట్ర రాజకీయాల్లో స్పేస్ ఉందని తరచూ చెప్పే గులాబీ బాస్ కేసీఆర్.. ఆ రాష్ట్రంలో బీఆర్ఎస్ సత్తా చాటేందుకు అవకాశాలు బోలెడన్ని ఉన్నట్లుగా తరచూ చెబుతుంటారు. అయితే.. రాష్ట్రాన్ని వదిలేసి.. వేరే రాష్ట్రం మీద ఫోకస్ పెట్టటంతో లాస్ తప్పించి లాభం ఉండదన్న గుర్రు గులాబీ నేతల్లో ఉంది. తమ అంతర్గత సంభాషణల్లో ఇలాంటి వాటిని చెప్పుకోవటం కనిపిస్తూ ఉంటుంది. ఇక.. కేసీఆర్ ఫ్యామిలీలోనూ మహారాష్ట్ర మీద పెడుతున్న 'ఫోకస్' (ఖర్చు) మీద ఏ మాత్రం ఇష్టపడటం లేదన్న మాట వినిపిస్తోంది. అయితే.. కేసీఆర్ నిర్ణయాల గురించి ఎదురు మాట్లాడే దమ్ము.. ధైర్యం ఎవరికి లేదన్న సంగతి తెలిసిందే.

దీంతో.. తమకు అత్యంత సన్నిహితుల వద్ద ఆవేదన తప్పించి మరింకేమీ చేయలేని పరిస్థితి. ఇదంతా ఒక ఎత్తు అయితే.. మహారాష్ట్ర మీద కేసీఆర్ కున్న ఆత్మవిశ్వాసం అంతా ఇంతా కాదు. ఇటీవల జరిగిన సమావేశంలోనూ ఆయన మహారాష్ట్ర మీద.. అక్కడ పార్టీ బలపడేందుకు ఉన్న అవకాశాల మీద వివరంగా వివరించినట్లు చెబుతున్నారు. మొత్తంగా మహారాష్ట్ర మీద మస్తు నమ్మకం ఉన్న గులాబీ బాస్ అంచనాలు నిజమన్నట్లుగా తాజాగా ఒక ఫలితం వెల్లడైంది. మహారాష్ట్రలో భారస శాఖ శిక్షణ శిబిరం జరుగుతున్న వేళలో.. గులాబీ దళం పండుగ చేసుకునేంత శుభవార్త ఒకటి అందింది. గత నెల నాలుగో వారంలో జరిగిన (ఏప్రిల్ 24న) భారాస బహిరంగ సభకు కాస్త సమీపంలో ఉండే శంభాజీనగర్ పరిధిలోని అంబేలోహల్ అనే గ్రామ పంచాయితీ ఉంది.

అందులో ఒకటో నెంబరు వార్డుకు ఉప ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థి గఫూర్ సర్దార్ పటాన్ 115 ఓట్ల అధిక్యంలో తన ప్రత్యర్థిపై విజయం సాధించారు. తాజా గెలుపుతో మహారాష్ట్రలో గులాబీ పార్టీ బోణీ కొట్టిందని చెప్పాలి. తాజాగా విజయం సాధించిన సదరు అభ్యర్థి ఈ మధ్యనే పార్టీలో చేరాడు. చేరినంతనే అధినేత సైతం ఆనందానికి గురయ్యే విజయాన్ని అందించారు. ఆయన విజయానికి తగిన ప్రతిఫలం అతగాడు ఊహించిన దాని కంటే ఎక్కువగా ఉంటుందంటున్నారు. మొత్తంగా కేసీఆర్ అంచనాలకు తగ్గట్లే మహారాష్ట్ర రాజకీయం మీద గులాబీ పార్టీ పట్టు సాధిస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాద్‌కు అలియంట్ గ్రూపు.. 9 వేల కొత్త ఉద్యోగాలు: మంత్రి కేటీఆర్

హైదరాబాద్: అమెరికాకు చెందిన అలియంట్ గ్రూపు సంస్థ .. హైదరాబాద్‌లో కొత్త సెంటర్‌ను ఏర్పాటు చేయున్నది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ రంగంలో అలియంట్ సంస్థకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆ కంపెనీకి చెందిన సీఈవో ధవల్ జాదవ్‌ను హూస్టన్‌లో మంత్రి కేటీఆర్ కలిశారు. కన్సల్టింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో పవర్‌హౌజ్‌గా పేరుగాంచిన అలియంట్ గ్రూపు .. హైదరాబాద్‌లోని బీఎఫ్ఎస్ఐ రంగాన్ని బలోపేతం చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. హైదరాబాద్ కేంద్రంలో ఆ సంస్థ కొత్తగా 9 వేల మందిని రిక్రూట్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ట్యాక్స్, అకౌంటింగ్, ఆడిట్ సర్వీస్, ఐటీ టెక్నాలజీకి చెందిన యువతకు ఇదొక సదావకాశం అవుతుందని మంత్రి తెలిపారు.

బీఎఫ్ఎస్ఐ పరిశ్రమకు హైదరాబాద్ నగరం కేంద్ర బిందువుగా మారుతోందని, అలియంట్ సంస్థ తీసుకున్న నిర్ణయం ఆ నగరంపై ఉన్న విశ్వాసాన్ని, నమ్మకాన్ని చూపుతుందని మంత్రి తన ట్వీట్‌లో వెల్లడించారు. హూస్టన్‌లో ఉన్న అలియంట్ గ్రూపు ప్రధాన కార్యాలయానికి వెళ్లిన మంత్రి కేటీఆర్‌కు అక్కడ ఘన స్వాగతం లభించింది. ఆ కంపెనీ ఉద్యోగులు మంత్రి కేటీఆర్‌కు వెల్కమ్ పలికారు. పూల దండలు వేసి ఆహ్వానం పలికారు.

# 35ఏళ్ల తరువాత హైదరాబాద్ సిటీ పోలీస్ రీ ఆర్గనైజేషన్



హైదరాబాద్: 35 ఏళ్ల తర్వాత హైదరాబాద్ పోలీస్ పునర్ వ్యవస్థీకరణ జరిగిందని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. శనివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడుతూ... హైదరాబాద్ జనాభా విపరీతంగా పెరుగిందన్నారు. సీఎం ఆదేశాల మేరకు హైదరాబాద్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మెరుగు చేయడంతో పాటు శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారన్నారు. దీంతో పోలీస్‌స్టేషన్ల పెంపుదల, జోన్ల రూపుపై ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామని తెలిపారు. 6 నెలల పాటు రీ ఆర్గనైజేషన్ కమిటీ కూర్చుని కొత్త పోలీస్‌స్టేషన్లకు ప్రతిపాదన చేసిందని అన్నారు. 35 ఏళ్ల కింద హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 25 లక్షల మంది జనాభా ఉండేవారని... ఇప్పుడు 85 లక్షలకు పెరిగిందన్నారు. 1987లో 8,76,126 వాహనాలు ఉంటే ఇప్పుడు 80,70,852 వాహనాలు పెరిగాయని సీపీ చెప్పారు.

**సెక్రటేరియట్ కోసం కొత్త పీఎస్...** హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ మూడు కమిషనరేట్లు కలిపి 1.60 కోట్ల మంది జనాభా శాంతి భద్రతలు కంట్రోల్ చేస్తున్నామన్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2 కొత్త డీసీపీ జోన్లు, 11 ఏసీపీ డివిజన్లు, 11 కొత్త లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్, 13 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లు, 5 కొత్త ఉమెన్ పోలీస్ స్టేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు. పోలీస్‌స్టేషన్లలో కేసులు పెరుగుతుండటంతో భారమవుతోందన్నారు. సెక్రటేరియట్ కోసం కొత్త పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని... సెక్రటేరియట్ పోలీస్‌స్టేషన్‌ను బీఆర్‌కే ఏర్పాటు చేస్తున్నామన్నారు. సెక్రటేరియట్ సెక్యూరిటీ కోసం ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు ఇన్స్పెక్టర్లు డ్యూటీలో ఉంటారన్నారు. సైబర్ క్రైమ్ కోసం.. ఒక డీసీపీతో పాటు మొత్తం 148 మంది పోలీస్ అధికారులను కేటాయించినట్లు చెప్పారు.

**జూన్ 2 నుంచి...** జూన్ 2 నుంచి కొత్త పోలీస్ స్టేషన్స్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తామన్నారు. 35% సివిల్ కానిస్టేబుల్స్ వేకెన్సీలు ఉన్నాయని, 120 ఎస్ఐ పోస్టులు వేకెన్సీ ఉన్నాయని చెప్పారు. కొత్త పోలీస్‌స్టేషన్లకు సరిపడే వెహికిల్స్, కంప్యూటర్స్, బైక్స్ ఇస్తామని వెల్లడించారు. కొత్త పోలీస్ స్టేషన్ల కోసం ప్రభుత్వం రూ.33 కోట్లు కేటాయించిందని సీపీ ఆనంద్ పేర్కొన్నారు. కొత్త పోలీస్ స్టేషన్‌లు కలిపి ప్రస్తుతం హైదరాబాద్ పోలీస్ కమిషనరెట్‌లో 78 పోలీస్ స్టేషన్లు ఉన్నాయన్నారు.

**అబిడ్స్ పోలీస్ స్టేషన్‌గా హైదరాబద్ కలక్టరేట్ బిల్డింగ్**

**బీఆర్‌కే భవన్‌లో సెక్రటేరియట్ పోలీస్ స్టేషన్**

**ఫిలింనగర్‌లో ఆపరేటివ్ సొసైటీ ప్రెమిసెస్‌లో ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు**

**మధురానగర్ పోలీస్ స్టేషన్‌గా రెహ్మత్ నగర్ ఓపీ బిల్డింగ్**

**సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లో ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్**

**హుమాయూన్ నగర్ పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లో మాసబ్‌ట్యాంక్ పోలీస్ స్టేషన్**

**బోరబండ ఔట్ పోస్ట్ పోలీస్ వద్ద బోరబండ పోలీస్ స్టేషన్**

# రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలపై సీఎం కేసీఆర్ సమీక్ష



హైదరాబాద్ : రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా శాఖల ప్రతిపాదనలపై సీఎం అధికారులతో చర్చిస్తున్నారు. రాష్ట్రం ఈ 9 ఏండ్లలో సాధించిన విజయాలను ప్రతిబింబించేలా దశాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. జూన్ 2న ప్రారంభమై 21 రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాల ప్రణాళికను సిద్ధం చేసేందుకు శుక్రవారం సచివాలయంలో మంత్రి హరీశ్‌రావు అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. మంత్రులు మహమూద్ అలీ, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, పువ్వాడ అజయ్‌కుమార్, గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, సత్యవతి రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గత 9 ఏండ్లలో ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ ఉత్సవాల నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని, జిల్లాల్లో జరిగే కార్యక్రమాల్లో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఉత్సవాలపై రూపొందించే డాక్యుమెంటరీల గురించి సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ఆయా శాఖలు సాధించిన విజయాలను చాటిచెప్పేలా శాఖలవారీగా డాక్యుమెంటరీలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

# బీఆర్ఎస్ విస్తరణతో దేశంలో రాజకీయ ప్రకంపనలు : నామ నాగేశ్వరరావు



హైదరాబాద్ : దేశంలో బీఆర్ఎస్ పార్టీ దావాణంలా వ్యాపిస్తూ రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తుందని, ప్రత్యర్థి పార్టీలకు ముచ్చమటలు పట్టిస్తుందని బీఆర్ఎస్ పార్టీ లోక్‌సభా పక్ష నాయకులు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అన్ని రాష్ట్రాల్లో బీఆర్ఎస్‌కు అమితమైన ఆదరణ లభిస్తోందన్నారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి కి ఆకర్షితులై మహారాష్ట్రకు చెందిన నాయకులు, ప్రజలు బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని వెల్లడించారు.కేసీఆర్ అభివృద్ధి మోడల్ ను దేశ ప్రజలుకోరుకుంటున్నారని అన్నారు. అబ్ కీ బార్ కిసాన్ కీ సర్కార్ అంటూ ఇచ్చిన నినాదం అద్భుతాలు సృష్టిస్తుందని అన్నారు. రైతుల నుంచి బ్రహ్మాండమైన స్పందన ఉందని వెల్లడించారు. తెలంగాణలో అమలవుతున్న రైతు బంధు , రైతు బీమా, 24 గంటల ఉచిత కరెంట్, సాగు, తాగు నీటి వంటి రైతు పథకాల పట్ల మహారాష్ట్ర రైతాంగం మక్కువ చూపిస్తున్నారని పేర్కొన్నారు. మహారాష్ట్రలోని అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ విస్తరణ పెరగడంతో అక్కడి సర్కార్ లో గుబులు మొదలయిందని అన్నారు. మరో వైపు పార్టీ శాశ్వత కార్యాలయాల ఏర్పాటు దిశగా కార్యాచరణ ఆరంభమైందని ఆయన తెలిపారు. అందులో భాగంగా అతి త్వరలోనే మహారాష్ట్ర , ఏపీ, ఒడిశా, తదితర రాష్ట్రాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయని చెప్పారు. అన్ని రాష్ట్రాల్లోని పార్టీ కార్యాలయాలు న్యూఢిల్లీ, హైదరాబాద్ లోని పార్టీ కేంద్ర కార్యాలయాలతో అనుసంధిస్తారని నామ స్పష్టం చేశారు.

# మహారాష్ట్ర రైతులను ముంచే పనిలో కేసీఆర్



హైదరాబాద్: తెలంగాణలో రైతు సమాధులపై దాష్టీక పాలన నడుపుతున్న కేసీఆర్.. ఇప్పుడు మహారాష్ట్ర రైతులను ముంచే పనిలో పడ్డారని వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో బుడ్డ దొరలకు, జమీందార్లకు, ఉద్యమద్రోహులకు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి.. మహారాష్ట్రలో మాత్రం రైతులు అసెంబ్లీకి పోవాలంటూ గప్పాలు కొడుతుండు పెద్ద దొర అంటూ దుయ్యబట్టారు. "మీరు చెప్పే తెలంగాణ మోడల్ అంటే.. తొమ్మిదేండ్లలో 9 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవడమా?.. పంట బీమా ఇవ్వక పోవడమా?.. పంట నష్టం జరిగితే మాట ఇచ్చి పరిహారం ఎగ్గొట్టడమా?... రాయితీ ఎరువులు, విత్తనాలు ఎత్తేయడమా?.. బడా బాబులకు రూ.వేల కోట్ల రైతుబంధు దోచిపెట్టడమా?.. ప్రాజెక్టుల పేరుతో రూ.లక్షల కోట్లు దోచుకోవడమా?... కనీస కనికరం లేకుండా రైతుల భూములు లాక్కొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడమా?.. అసైన్డ్ భూములను సైతం లాక్కొని రైతును రోడ్డునపడేయడమా?.. కౌలు రైతు.. రైతే కాదని చెప్పడమా?.. వరి వేస్తే ఉరేనని రైతులను బెదిరించడమా?.. కేసీఆర్‌కు రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే, నీది నిజంగానే కిసాన్ సర్కార్ అయితే.. రుణమాఫీ చేయనందుకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 119 చోట్ల రైతులకే టికెట్లు ఇవ్వాలి. దళిత రైతును ముఖ్యమంత్రి చేసి, ఇతర రైతులను మంత్రులను చేయాలి. మాట ఇస్తే.. తలనరుక్కునే ముఖ్యమంత్రికి ఈ దమ్ముందా?" అంటూ షర్మిల సవాల్ విసిరారు.

# రాబోయే 3 రోజుల్లో తెలంగాణలో మోస్తరు వర్షాలు..!



హైదరాబాద్ : రాష్ట్రం భానుడి భగభగలతో అట్టుడుకుతోంది. మండుతున్న ఎండలతో ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటేనే హడలెత్తుతున్నారు. సూర్యుడి సెగ తట్టుకోలేక చాలా మంది వడదెబ్బకు గురవుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న రాష్ట్ర ప్రజలకు వాతావరణ కేంద్రం చల్లటి కబురు చెప్పింది. తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో రాగల మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ద్రోణి శుక్రవారం తూర్పు మధ్యప్రదేశ్ నుంచి విదర్భ మీదుగా ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని తెలిపింది. దిగువ స్థాయిలో గాలులు వాయవ్య దిశ నుంచి తెలంగాణలోకి వీస్తున్నాయని పేర్కొంది. నైరుతి రుతుపవనాలు ఆగ్నేయ బంగాళాఖాతంలోకి చేరాయి. నికోబార్ ఐలాండ్స్, దక్షిణ అండమాన్ సముద్రంలోని కొన్ని భాగాల వరకు రుతుపవనాలు విస్తరించాయని తెలిపింది. అలాగే హైదరాబాద్ చుట్టు పక్కల జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 39 నుంచి 41 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది.

# రూ.2 వేల నోటు చూడక మూడు నెలలవుతోంది



హైదరాబాద్ : నిన్న సాయంత్రం సడెన్‌గా ఆర్బీఐ రూ.2 వేల నోట్ల రద్దును ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై పలువురు రాజకీయ నేతలు స్పందిస్తున్నారు. రూ. 2000 నోట్ల రద్దుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పందించారు. తాను రూ.2000 నోటు చూడక రెండు మూడు నెలలు అవుతోందన్నారు. తాను ఎప్పుడు ఏటీఎంకి వెళ్లి డబ్బులు డ్రా చేసినా 500 నోట్లే వస్తున్నాయన్నారు. 2000 ఎక్కడికి చేరాలో అక్కడికి చేరిందన్నారు. సీఎం కేసీఆర్ కి మెమోరీ లాస్ స్టార్ట్ అయిందన్నారు. కేసీఆర్ ఏమేం మాట్లాడారో గుర్తు రావాలంటే పాత వీడియో రికార్డులు చూడాలన్నారు. దళితులు, బలహీన వర్గాలకు కాంగ్రెస్ ఇచ్చిన భూములను కేసీఆర్ లాక్కొని అమ్మకానికి పెడుతున్నారని జీవన్ రెడ్డి విమర్శించారు

# గడ్డం శపథమే తీరలేదు.. ఇప్పుడు మళ్లీ ఇదేం సవాలు ఉత్తమ్?

టీపీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించినప్పటికీ.. కాంగ్రెస్ అధినాయకత్వం పెట్టిన నమ్మకానికి తగ్గట్లుగా తనను తాను ప్రూవ్ చేసుకోవటంలో ఫెయిల్ అయ్యారు ఉత్తమ్ కుమార్ రెడ్డి. అంతేనా.. కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చే వరకు గడ్డం తీయనన్న ఆయన సవాలు అప్పట్లో సంచలనంగా మారటమే కాదు.. ఆయన ఏళ్లకు ఏళ్లుగా గడ్డంలోనే ఉండిపోవాల్సిన దుస్థితి. ఆయన రాజకీయ ప్రత్యర్థులు అప్పట్లో గడ్డం సవాలు మీద బోలెడన్ని జోకులు వేసి.. ఉత్తమ్ ను ఇరిటేట్ చేసే ప్రయత్నం చేయటం తెలిసిందే. ఇప్పటికి గడ్డం సవాలు తీరకపోవటం.. అదెప్పటికి తీరుతుందో అర్థం కాని పరిస్థితులు ఇప్పటికి ఉన్నాయి. ఇలాంటి వేళలో.. ఆయన మరో భారీ సవాలు విసిరారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కోదాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ కు 50వేల కంటే తక్కువ మెజార్టీ వస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సంచలన సవాలు విసిరారు. కోదాడలో నిర్వహించిన పార్టీ ఎన్నికల సన్నాయక సమావేశంలో పాల్గొన్న ఆయన.. గులాబీ ఎమ్మెల్యే అవినీతిని తీవ్రంగా తప్పు పట్టారు. కోదాడ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా ప్రస్తుత ఎమ్మెల్యేవెంచర్లు.. వైన్స్ .. మట్టి.. ఇసుక తవ్వకాల్లో వాటాల్ని వసూలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల్ని పోలీసులు అన్ని విధాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెబుతున్నారు. కొందరు తమ పార్టీకి చెందిన నాయకులే సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో.. వచ్చే ఎన్నికల్లో కోదాడ అసెంబ్లీ నియోజకవర్గంలో 50వేల మెజార్టీ ఖాయమని.. అలా జరగకుంటే తాను రాజకీయాల నుంచి శాశ్వితంగా తప్పుకుంటానని సవాలు విసిరారు. మరీసారి ఏం జరుగుతుందో చూడాలి.

# తెలంగాణలో బీజేపీకి చోటు లేదు : కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం : కులం పేరుతో కుంపట్లు, మతం పేరుతో మంటలు రాజేస్తున్న బీజేపీకి తెలంగాణలో చోటు లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సంసిద్ధులై ఉన్నారని జోస్యం చెప్పారు. కార్పొరేట్ సంస్థలకు తొత్తులుగా మారి దేశ సంపదనంతా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమయ్యేలా నిర్ణయాలు తీసుకుంటూ దేశాన్ని అధోగతి పాలు చేస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రజలను రక్షించుకునేందుకు భావసారూప్యత కలిగిన పార్టీలన్నీ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు.ప్రశ్నించేవారందరిపై అక్రమ కేసులు పెట్టి వేధించడం నరేంద్ర మోదీకి పరిపాటిగా మారిందని విమర్శించారు. కర్ణాటక లో 40శాతం మంది బీజేపీ నాయకులు అవినీతిలో కూరుకుపోవడంతో ఆ పార్టీని ప్రజలు ఓడించారని, ఇది మార్పునకు సంకేతమన్నారు. రాముని పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ బీజేపీపై చేస్తున్న యుద్ధానికి తామంత సహకారం అందిస్తామని అన్నారు. బొగ్గుగనులను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టకుండా రాష్ట్రాలన్నింటినీ ఇబ్బందులుపెడుతూ పరిపాలన సాగించకుండా మోకాలడ్డుతోందన్నారు. విభజన చట్టంలోని హామీలను ఏ ఒక్కటీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జూన్ 4న ప్రకాశం స్టేడియంలో నిర్వహించే 'ప్రజా గర్జన' ముగింపు సభకు లక్షలాదిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, నాయకులు బందెల నర్సయ్య, చంద్రగిరి శ్రీనివాస్, దమ్మాలపాటి శేషయ్య, ముత్యాల విశ్వనాథం, వై.శ్రీనివాసరెడ్డి, నరాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com